

ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు అంకితభావంతో ప్రజాసేవ చేసిన చంద్రబాబుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఐటీ, పారిశ్రామికాభివృద్ధి, రైతు, యువత, మహిళల సంక్షేమం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్మార్ట్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్రాభివృద్ధికి మార్గదర్శి నేతగా ఆయన గుర్తింపు పొందారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 11.10.2025

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 175 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# కొత్త ఉత్సాహంతో అభివృద్ధి శంఖారావం!





## 32వ ఇ-క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి దిశగా పలు కీలక నిర్ణయాలు

## రూ.1.27 లక్షల కోట్ల పెట్టుబడులకు మంత్రివర్గం ఆమోదం

## గూగుల్ డేటా సెంటర్‌తో ఐటీ రంగానికి భారీ ఊపిరి

## గ్రామ పంచాయతీ పునర్వ్యవస్థీకరణ - 48 ఏళ్ల తర్వాత విప్లవాత్మక సంస్కరణ

## అమరావతిలో గవర్నర్ నివాస సముదాయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :ఆంధ్రప్రదేశ్ కొత్త ఉత్సాహంతో ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో శుక్రవారం జరిగిన 32వ ఇ-క్యాబినెట్ సమావేశం రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త దిశను చూపింది. లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు, లక్షలాది ఉపాధి అవకాశాలు, ప్రపంచస్థాయి ప్రాజెక్టులుఇవి అన్నీ ఒకే రోజు ఆమోదం పొందడంతో అమరావతిలో అభివృద్ధి శబ్దం మార్మోగింది. పరిశ్రమలు, పర్యాటకం, సమాచార సాంకేతికం, గ్రామీణ పరిపాలన.. ప్రతి రంగానికీ నూతన ఊపిరి నింపేలా మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని దూసుకెళ్తున్నాయి.

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర సచివాలయ 32వ ఇ-క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి దిశగా చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. మొత్తం రూ1,27,181 కోట్ల పెట్టుబడుల విలువైన ప్రాజెక్టులు, 78,771 ఉద్యోగావకాశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలో జరిగిన ఈ సమావేశం అనంతరం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమావేశ వివరాలను మీడియాకు వెల్లడించారు.

పారిశ్రామిక, పెట్టుబడి రంగాల్లో కొత్త ఊపిరి నింపేలా అనకాపల్లి జిల్లాలో అధునాతన కార్బన్ కాంప్లెక్స్, పల్నాడు జిల్లాలో సమగ్ర సిమెంట్ ప్లాంట్, అనంతపురం జిల్లాలో గుడిపల్లి మరియు తేకులోడులో ఏరోస్పేస్, ఆటోమోటివ్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులు కలిపి రూ5,800 కోట్ల పెట్టుబడితో 6,646 మందికి ఉపాధి కారకమవనున్నాయి. అదేవిధంగా ప్రకాశం, కర్నూలు, విశాఖపట్నం, మిగతా 2లో...

### పోర్టులు... ఎయిర్ పోర్టులతో

# సర్వతోముఖాభివృద్ధి



**ఇథనాల్ ప్లాంట్లతో పర్యావరణానికి మేలు**

**పశు పోషణతో పాడి రైతులకు ఆర్థికాభివృద్ధి**

**విశ్వసముద్ర గ్రూప్ కు చెందిన వివిధ ప్రాజెక్టులు ప్రారంభించిన సీఎం**

నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) : పోర్టులు, ఎయిర్ పోర్టులతో రాష్ట్రం ఆర్థికాభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని ఈదగాలి గ్రామంలో విశ్వసముద్ర గ్రూపునకు చెందిన వివిధ ప్రాజెక్టులను శుక్రవారం సీఎం ప్రారంభించారు. ఇథనాల్ ప్లాంట్, నంద గోకులం లైఫ్ స్కూల్, సేవ్ ద బుల్, పవర్ ఆఫ్ బుల్ ప్రాజెక్టులను సీఎం ప్రారంభించి.. పరిశీలించారు. నంద గోకులం లైఫ్ స్కూల్ విద్యార్థులతో చంద్రబాబు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."నెల్లూరు జిల్లాలో ఇప్పుడు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులతో పాటు.. మిగతా 2లో...

### 16న సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్స్

# విజయోత్సవ సభ




**ప్రధాని మోడీతో పాటు సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రి లోకేష్ హాజరు**

**జిఎస్ టి సేవింగ్స్‌పై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు**

**ఏర్పాట్లపై ఉన్నతస్థాయి అధికారులతో మంత్రుల బృందం సమీక్ష**

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఈనెల 16వతేదీన కర్నూలులో ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే సూపర్ జిఎస్ టి – సూపర్ సేవింగ్స్ సభను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ కోరారు. ప్రధాని రాష్ట్ర పర్యటన ఏర్పాట్లపై ఉండవల్లి నివాసంలో నిర్వహించిన మంత్రుల బృందం సమావేశానికి రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ముఖ్యమంత్రి కార్యాలయ సీనియర్ అధికారులు మిగతా 2లో...

## రాజధాని రైతులకు కౌలు జమ



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్.ఫైల్) : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతులు, భూ యజమానులకు చెల్లించాల్సిన వార్షిక కౌలును ప్రభుత్వం జమ చేసింది. రైతుల బ్యాంకు ఖాతాల లింకేజీ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక కారణాలు, కొందరు రైతులు ప్లాట్లను విక్రయించడం, మరణించిన రైతుల వారసుల ఖాతాల వివరాలు సకాలంలో అధికారులకు అందలేదు. దీంతో పలువురు రైతుల ఖాతాల్లో 9వ, 10వ, 11వ ఏడాదికి సంబంధించి వార్షిక కౌలు సొమ్ము జమ కాలేదు. ఈ తరహా సమస్యలను పరిష్కరించిన ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్డీఏ).. 495 మందికి అందాల్సిన పెండింగ్ వార్షిక కౌలు రూ.66,480,402 సంబంధిత రైతులు, భూయజమానుల ఖాతాలలో చేసింది. ఈ మొత్తం నగదులో 9వ, 10వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించి 232 మందికి గాను రూ.4,08,41,632, అలాగే 11వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించి 263 మందికిగాను రూ.2,56,38,770 సంబంధిత రైతులు, భూ యజమానుల బ్యాంకు ఖాతాలలో జమ చేసినట్టు సీఆర్డీఏ కమిషనర్ తెలిపారు.

### రాష్ట్ర 'ఆయుష్' రంగంలో

# సరికొత్త అధ్యాయం



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారిగా రాష్ట్రంలో 'అయుష్' వైద్య సేవల విస్తరణ, మెరుగు కోసం రూ.166 కోట్లు మంజూరు చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.166 కోట్ల వ్యయానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ముఖ్యంగా రూ.210 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో కొత్తగా రెండు ఆయుర్వేద, ఒక యూనాని వైద్య కళాశాల రాబోతుంది. ఆరు జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు కూడా ఏర్పాటుకాబోతున్నాయి. ఒక్కో ఆసుపత్రి ఏర్పాటుకు రూ.7 కోట్ల వరకు వ్యయం కానుంది. అంతేకాకుండా ఆయుర్వేద ఆరోగ్య మందిరాలను అభివృద్ధికి కూడా కేంద్రం నిములు కేటాయించింది.

**కిందటేడాది నుంచి ఇప్పటివరకు రూ.248 కోట్లు మంజూరు!**

2014-24 మధ్య రాష్ట్రానికి రూ.120.17 కోట్లు మాత్రమే రాష్ట్రానికి వచ్చాయి. ఇందులో గత వైకాపా పాలనలో కేంద్రం నుంచి రూ.38,09 కోట్లు విడుదల అయ్యాయి. 2021 నుంచి మూడేళ్లపాటు అసలు వైకాపా ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కేంద్రానికి వెళ్లలేదు. కేంద్రం, రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ సర్కారువల్ల ఆయుష్ శాఖకు నిధులు చారీగా వస్తున్నాయి. 2లో...

## మారుమూల ప్రాంతంలో మానవీయ వెలుగులు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : మారుమూల ప్రాంతంలో మానవీయ వెలుగులు ప్రసరిస్తున్నాయి. కష్టం అంటే చాలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కదిలి వస్తున్నారు. ఫలితంగా ఇవాళ ముఖ్యమంత్రి సహాయ నిధి తరఫున ఎన్నడూ లేని విధంగా, త్వరితగతిన ఆరోగ్య సంబంధ సమస్యలకు సంబంధించి బాధితులకు గొప్పనైన భరోసా అందుతోంది. తత్ ఫలితంగా 130 మంది లబ్ధిదారులు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు కాళ్లరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదని కానీ ఇప్పుడు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి సకాలంలో అందేలా కృషి చేసి, కొన్ని వందల కుటుంబాల్లో వెలుగులు నింపడం ఓ గొప్ప పరిణామం అని బాధితులు చెబుతున్నారు. ఆనందోత్సాహాలతో చెబుతున్నారు.

**ఎప్పటికప్పుడు అప్రమత్తం అవుతూ....బాధితుల గుండె ఘోష వింటూ..**

ముఖ్యంగా టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటిదాకా రెండు కోట్ల రూపాయలకు పైగా ఏడాదిన్నర కాల వ్యవధిలోనే అందించడం, ఇందుకు అనుగుణంగా పరిణామాలు సానుకూలం కావడం బాధిత వర్గాలలో అచ్చెన్న నింపిన స్ఫూర్తి ఓ కారణం. అలానే ఏ సమస్య వచ్చినా నేనున్నానని ఇరవై నాలుగు గంటలూ కార్యాలయ వర్గాలను అందుబాటులో ఉంచి బాధిత వర్గాల గోడు వినేందుకు ప్రాధాన్యం ఇస్తున్న మిగతా 2లో...

### బీసీ హాస్టల్ విద్యార్థుల

# అస్వస్థతపై ఆరా




అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు జిల్లా అన్నపర్రు బీసీ సంక్షేమ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ ఘటనపై ప్రసారమైన కథనాలపై జిల్లా ఇంచార్జ్ మంత్రి కందుల దుర్గేష్ స్పందించి వివరాలు ఆరా తీశారు. బీసీ బాలుర హాస్టల్ లో పదుల సంఖ్యలో విద్యార్థులకు అస్వస్థతకు గురవ్వడం బాధాకరమని పేర్కొన్నారు. వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని సూచించారు. త్వరతగతిన విద్యార్థులు కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగానికి సూచించారు.

### రాజధానికి రూ.2,047 కోట్లతో

# రైల్వేలైన్ ప్రతిపాదన..!

- ముమ్మరంగా కొనసాగుతున్న డంబ్లింగ్ పనులు
- కొన్నిచోట్ల వేగంగా భూసేకరణ
- ఎర్రుపాలెం-అమరావతి-
- నంబూరు మధ్య 57 కిలోమీటర్ల రైల్వే లైన్
- పార్లమెంటులో వీటిపై ఇప్పటికే ప్రకటన చేసిన కేంద్ర రైల్వే మంత్రి



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) : ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు మధ్య 57 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మేరకు నిధులు కూడా కేటాయించారు. అన్ని హంగులతో ప్రతిపాదనలు కూడా సిద్ధమయ్యాయి. ఇదే విషయాన్ని రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్ పార్లమెంటులో వెల్లడించాడు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఎప్పటినుంచో ఈ రైల్వేలైన్ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు ప్రాంతాల్లో. ఈ.కొత్త రైల్వే లైన్? నిర్మిస్తారు

ఏపీ రాజధాని అమరావతికి రైల్వేలైన్ అనుసంధానం చేయడం కోసం 2,047 కోట్ల రూపాయలతో ఎర్రుపాలెం-నంబూరు మధ్య 57 కిలో మీటర్ల పొడవైన మిగతా 2లో...

## 'టెక్స్ టైల్స్'కు ఉజ్వల భవిష్యత్తు



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో టెక్స్ టైల్స్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. టెక్స్ టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహమందిస్తోందన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు మంత్రి సవితను శుక్రవారం అమెల్ సి ఆల్ట్ కన్సార్టియం ప్రతినిధులు కలిశారు. హిందూపురంలోని ఇంటిగ్రేటెడ్ టెక్స్ టైల్స్ పార్క్‌లో పెట్టుబడులకు ఆసక్తిచూపుతున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు డాక్టర్ చక్రవర్తి, సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను తక్షణమే అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకురావడంతో ఆ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఏర్పాడిందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున టెక్స్ టైల్స్ పార్క్ లో నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం అమెల్ సి ఆల్ట్ కన్సార్టియం ప్రతినిధులను మంత్రి సవిత ఘనంగా సత్కరించారు.

## పోర్టులు... ఎయిర్ పోర్టులతో
# సర్వతోముఖాభివృద్ధి



(మొదటి పేజీ తరువాయి)

కీలక పరిశ్రమలు వచ్చాయి. కృష్ణపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులు జిల్లా అభివృద్ధికి కీలకంగా మారతాయి. దగదర్తి విమానాశ్రయం త్వరలోనే వస్తుంది. బీపీసీఎల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ , క్రిబ్ కో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కూడా రాబోతున్నాయి. రాష్ట్ర ప్రగతిలో.. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో నెల్లూరు జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. ఇదే సమయంలో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం లేదు. సోమశిల, కండలేరు లాంటి మంచి ప్రాజెక్టులు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. 150 టీఎంసీల నీళ్ల ఈ రెండు ప్రాజెక్టుల్లో ఉంటాయి. భవిష్యత్తులో నీటి కొరత లేకుండా ఈ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉంచుతాం.” అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి... పర్యావరణం బాగుండాలి :** “ఏ ప్రాజెక్టులు చేపట్టినా... రాష్ట్రానికి ఆర్థికంగా ఉపయోగపడడంతోపాటు... పర్యావరణ హితంగా ఉండాలి. ఈ దిశగానే విశ్వసముద్ర మూడు ప్రాజెక్టులు చేపట్టింది. 24 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్ ఉత్పత్తి చేస్తోంది. దీని కోసం 15 వేల టన్నులకు పైగా పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాల కొనుగోలు చేస్తోంది. దీని వల్ల రైతులకు మేలు జరుగుతోంది. రైతుల సంక్షేమంతో పాటు ఇథనాల్ తయారు చేస్తూ విశ్వసముద్ర యాజమాన్యం దేశ ప్రగతికి తోడ్పడుతోంది. అలాగే పశు సంపదను కాపాడేందుకు కొత్త ప్రయోగం చేయటం అభినందనీయం. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన గోవులను సంరక్షిస్తున్నారు. ఒంగోలు జాతి పశువులను సంరంక్షిచడంపై ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేయడమే కాకుండా.. శాస్త్రీయ పద్ధతుల్లో పునరుత్పత్తికి చింతా శశిధర్ ఫౌండేషన్ పని చేస్తోంది. పవర్ ఆఫ్ బుల్ అనే విధానంలో విద్యుత్పత్తి చేపట్టడం వినూత్న ప్రక్రియ. ఈ విధానం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 5 కిలోవాట్లను ఇన్ హౌస్ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇక నంద గోకులం లైఫ్ స్కూల్ ద్వారా ప్రతిభ కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉత్తమ విద్యను అందిస్తున్నారు. సమాజానికి తిరిగి ఇవ్వటం అనే విధానంలో భాగమే పీ4. డబ్బులు ఇవ్వటం ఒక్కటే కాదు చేయూత ఇవ్వడమనేది పీ4 విధానంలో ముఖ్యమైన అంశం.” అని ముఖ్యమంత్రి వివరించారు.

**భవిష్యత్తులో భారీ పెట్టుబడులు :** “విశాఖకు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నాం. రూ. 88 వేల కోట్లతో ఓ దేశచరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కు అల్గారిథమ్స్ కూడా రాసేలా మన పిల్లలు సిద్ధం అవుతున్నారు.

2047కి భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తయారవుతుంది. ఏపీ దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఉంటుంది” అని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదా మస్తాన్ రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు హాజరయ్యారు.

## 16న సూపర్ జీఎస్టి - సూపర్ సేవింగ్స్
# విజయోత్సవ సభ



(మొదటి పేజీ తరువాయి)

కార్తికేయ మిశ్రా, పీయూష్ కుమార్, అహమ్మద్ బాబు హాజరయ్యారు. ఈనెల 16వతేదీ ఉదయం ప్రధాని మోడీ సున్నిపెంట వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం ద్వారా శ్రీశైలం బయలుదేరి వెళతారు. అనంతరం శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. తర్వాత శ్రీశైలం నుంచి బయలుదేరి కర్నూలు సమీపంలోని నన్నూరు రంగమయూరి గ్రీన్ హిల్స్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సూపర్ జిఎస్ టి – సూపర్ సేవింగ్స్ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ నిర్వహించే సభలో ప్రధాని మోడీతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ ప్రసంగిస్తారు. సభానంతరం ప్రధాని మోడీ సాయంత్రం కర్నూలు సమీపాన గల ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకుని డిల్లీ బయలుదేరి వెళ్తారు.

రాష్ట్రవ్యాప్తంగా సూపర్ జిఎస్ టి – సూపర్ సేవింగ్స్ పై పెద్దఎత్తున నిర్వహించిన ప్రచార, అవగాహన కార్యక్రమాల గురించి మంత్రుల బృందం చర్చించింది. ఈ సందర్భంగా అధికారులు స్పందిస్తూ... ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ 98,985 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వ్యాపార సంస్థలు, ఎంఎస్ఎంఈ, రైతు కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. సూపర్ జిఎస్ టి %–% సూపర్ సేవింగ్స్ పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించామని అధికారులు తెలిపారు. నూతన జిఎస్ టి విధానంవల్ల కలిగే లబ్ధిపై రాష్ట్రవ్యాప్తంగా హాస్పటల్స్ లో 22,500 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... నూతన జిఎస్ టి అమలులోకి వచ్చాక రాష్ట్రంలో ఆటోమొబైల్ సేల్స్ గణనీయంగా పెరిగాయని, ఈ పెరుగుదల 33శాతానికి పైగా ఉందని చెప్పారు. లగ్జరీ కార్లకు సైతం సెస్సును తొలగించడం వల్ల ఆ విభాగంలో కూడా అమ్మకాలు ఆశాజనకంగా నమోదవుతున్నాయని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 16నుంచి 19 తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో గ్రాండ్ జిఎస్టి షాపింగ్ ఫెస్టివల్స్ ఏర్పాటు చెయ్యాలని అధికారులను మంత్రుల బృందం కోరింది.

# కొత్త ఉత్సాహంతో అభివృద్ధి శంఖారావం!

(మొదటి పేజీ తరువాయి)

విజయనగరం జిల్లాల్లో పారిశ్రామిక హబ్‌లు, ఇన్నోవేషన్ కేంద్రాలు మరియు ప్రైవేట్ మెగా పార్కుల అభివృద్ధి చేపట్టనున్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. అమరావతి, శ్రీశైలం, విశాఖపట్నం, అరకు వ్యాలీ, తిరుపతి వంటి ప్రదేశాల్లో మారియట్, హిల్టన్, దస్పల్ల, ఓబెరాయ్, తాజ్ వంటి అంతర్జాతీయ బ్రాండ్ల హోటళ్లు, రిసార్టులు స్థాపించడానికి ఆమోదం లభించింది. మొత్తం రూ1,628.8 కోట్ల పెట్టుబడితో 4,398 మంది ప్రత్యక్షంగా, మరికొంతమంది పరోక్షంగా ఉద్యోగాలు పొందనున్నారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త దిశనందించనున్నారు.

సమాచార సాంకేతిక, డేటా సెంటర్ రంగాల్లో రాష్ట్రం ప్రధాన పురోగతిని సాధించబోతోంది. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం మరియు అనకాపల్లి జిల్లాల్లో రూ87,520 కోట్ల భారీ పెట్టుబడితో కృత్రిమ మేధస్సు ఆధారిత డేటా సెంటర్ స్థాపించనుంది. భీమిలిలో ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ రూ140 కోట్లతో ఐటీ సదుపాయాన్ని అభివృద్ధి చేయనుంది. అదనంగా, లిఫ్ట్ విధానం ద్వారా మధ్య తరహా సమాచార సాంకేతిక సంస్థలకు భూమి కేటాయింపులు చేయాలని నిర్ణయించారు. పారిశ్రామిక విస్తరణ, ఆహార ప్రాసెసింగ్ రంగాలు కూడా సమావేశంలో ప్రధానాంశాలుగా నిలిచాయి. రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్, గోద్రేజ్ ఆగ్రోవెట్, ఎస్‌వీఎఫ్ సోయా, ఫ్రెష్ బౌల్ వంటి ప్రముఖ సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఆమోదించారు. జేవీ ఎస్‌డబ్ల్యూ, ఆర్సిలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్, శ్రీ సిమెంట్, సన్వీరా ఇండస్ట్రీస్, పీసీబీఎల్ కెమికల్ కంపెనీలకు విస్తరణలు చేపట్టేందుకు అనుమతులు లభించాయి. రాజధాని అమరావతిలో గవర్నర్ నివాస సముదాయం నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.



రూ212.22 కోట్ల వ్యయంతో గవర్నర్ మాన్షన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ కార్యాలయం, సిబ్బంది నివాసాలు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు అమరావతిని రాజధానిగా బలోపేతం చేస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

గ్రామ పంచాయతీ పరిపాలనలో సంస్కరణలు చేపడుతూ 7,244 గ్రామ పంచాయతీ క్లస్టర్లను రద్దు చేసి 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లుగా పునర్వ్యవస్థీకరించనున్నారు. పంచాయతీ అభివృద్ధి అధికారి పదవులను ప్రవేశపెట్టి, సెక్రటరీ గ్రేడ్లను హేతుబద్ధీకరించడం ద్వారా సంవత్సరానికి రూ37.77 కోట్ల ఆదా సాధించనున్నారు. ఈ సంస్కరణ రాష్ట్రంలోని గ్రామీణ పరిపాలనలో 48 సంవత్సరాల తరువాత జరిగే అతిపెద్ద మార్పుగా నిలుస్తుందని నివేదిక పేర్కొంది.

నీటి వనరులు మరియు పట్టణాభివృద్ధి శాఖల పరిధిలో 7,197 నీటిపారుదల పనులకు రూ344.39 కోట్ల పరిపాలనా ఆమోదం లభించింది. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన కన్వెన్షన్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ ద్వారా విజయవంతమైన బిడ్డర్ల ఎంపిక కూడా జరిగింది.

ఇతరంగా, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ పునరుద్ధరణకు మద్దతుగా విద్యుత్ బకాయిలను స్వీకరించడం, కొత్త మండలాల ఏర్పాటు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–అర్బన్ గృహ నిర్మాణానికి భూమి బదిలీలు, పర్యావరణ పర్యవేక్షణ కేంద్రాల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర పారిశ్రామిక, పర్యాటక, సమాచార సాంకేతిక, పట్టణాభివృద్ధి రంగాలకు భారీ ఊపునివ్వనున్నాయని మంత్రివర్గం పేర్కొంది. ఈ కేబినెట్ సమావేశం ముఖ్యమ్మంత్రి చంద్రబాబు మాట్లాడుతూ , వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు చాలా చేసామని తెలిపారు. అందుకే.. దానిని మూతపడకుండా చేయగలిగామని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ను నష్టాల నుంచి బయటకు తీసుకురాగలిగామని పేర్కొన్నారు. వైజాగ్‌కు రైల్వే జోన్, గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టులను తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు.

**వెస్ట్‌లో ముంబై తరహాలో ఈస్ట్‌లో విశాఖ.. :** ఆర్సెలార్ మిత్తల్ ప్లాంట్‌కు త్వరలో శంకుస్థాపన చేయబోతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. విశాఖను ముంబై లాగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పంచాయితీ రాజ్‌లో పంచాయతీలు రేషనలైజేషన్ చేసి రూరల్, అర్బన్ పంచాయితీలుగా చేయాలని తెలిపారు. 2028 నాటికి వైజాగ్ దేశంలో ఒక ప్రత్యేక సిటీగా ఉండబోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటీ రంగంలో లక్షలాది ఉద్యోగాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. వెస్ట్‌లో ముంబై తరహాలో ఈస్ట్‌లో విశాఖ అభివృద్ధి చెందబోతుందన్నారు. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోమ్‌లో 4 లక్షల 70 వేల మంది ఆంధ్రాలో పని చేస్తున్నారని తెలిపారు. దీనిని 10 లక్షలకు పెంచాలని అధికారులకు చెప్పినట్లు చంద్రబాబు స్పష్టం చేశారు.

**మంత్రులుకు దిశానిర్దేశం.. :** మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మంత్రులు, సెక్రటరీలకు చెప్పినప్పటికీ శాఖను నడిపించాల్సిన బాధ్యత మంత్రులదే అని తెలిపారు. శాఖలో పని చేయకపోతే వారిని పిలిచి మందలించాల్సింది మంత్రులే అని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాల్సింది మంత్రులే కానీ అధికారులు కాదు అనే విషయం గుర్తు పెట్టుకోవాలని సీఎం చెప్పారు. తన 15 ఏళ్ల సీఎం ప్రస్థానంలో ఎప్పుడూ ఇన్ని పెట్టుబడులు రాలేదని చంద్రబాబు వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గూగుల్ డేటా సెంటర్ మనకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెద్ద ఎత్తున రావడంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర ‘ఆయుష్’ రంగంలో సరికొత్త అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)

24–25లో రూ. 83.23 కోట్లు, 2025–26లో రూ. 165.65 కోట్లు కేంద్రం కేటాయించింది. రాష్ట్ర ఆయుష్ శాఖ చరిత్రలో రెండేళ్ల వ్యవధిలో రూ. 248.89 కోట్లు మంజూరు కావడం ఇదే తొలిసారి. కేంద్రం భారీస్థాయిలో నిధుల విడుదలకు ఆమోదం తెలుపడంపట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఆయుష్ వైద్య విద్యారులు నిర్వహించిన ఆత్మీయ సత్కారం కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ధర్మవరం, కాకినాడలో కొత్తగా ఆయుర్వేద వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాయలసీమలోనే యూనాని వైద్య కళాశాలను ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఒక్కో కళాశాల నిర్మాణానికి రూ. 70 కోట్ల వరకు ఖర్చు అవుతుందని మంత్రి తెలిపారు.

కేంద్రంతో వార్షిక నిధుల ఖరారు సమయంలో ఆయుష్ కమిషనర్ దినేష్ కుమార్ చూపిన చొరవను మంత్రి సత్యకుమార్ అభినందించారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో యోగా రీసెర్చి సెంటర్ ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. 2 ఆయుర్వేద వైద్య కళాశాలలు, 1 యూనాని కళాశాల ఏర్పాటు

ధర్మవరం, కాకినాడలో ఒక్కొక్క ఆయుర్వేద, రాయలసీమలో ఏర్పాటుకానున్న ఒక యూనాని వైద్య కళాశాలకు కలిపి రూ. 70 కోట్ల చొప్పున రూ. 210 కోట్లు కేంద్రం కేటాయించింది. ఇందులో 2025–26 ఆరిక సంవత్సరానికిగాను రూ. 46. 10 కోట్లు వ్యయం చేయనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మూడు హోమియో, ఒక ఆయుర్వేద వైద్య కళాశాల చొప్పున ఉన్నాయి. 2026–27 విద్యా సంవత్సరం నుంచి విశాఖలోని నేచురోపతి కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం కాబోతున్నాయి. కొత్తగా రానున్న వాటితో కలిపితే రాష్ట్రంలో కళాశాలల సంఖ్య 8కు చేరుకుంటుంది. లివిశాఖలో ని ప్రభుత్వ నేచురోపతి (ప్రకృతి వైద్యం), యోగా కళాశాల (100 పడకలు) కోసం రూ. 23 కోట్లు కేంద్రం



కేటాయించింది.

**రూ.52.35 కోట్ల వ్యయంతో 6 జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు!**

శ్రీకాకుళం, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున 50 పడకల సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు రూ. 52. 35 కోట్లు కేంద్రం మంజూరుచేసింది. ఇందులో ఈ ఆరిక సంవత్సరానికి రూ. 30. 34 కోట్లు విడుదల చేయడానికి ఆమోదం కేంద్రం అంగీకరించింది.

**276 ఆయుష్ డిస్పెన్సరీల అభివృద్ధికి రూ.49.76 కోట్లు!**

శిథిలావస్థలో ఉన్న 90 ఆయుష్ ఆరోగ్య మందిర (డిస్పెన్సరీలు) భవనాల పునర్నిర్మాణానికి రూ. 27 కోట్లు, జిల్లా, సీహెచ్సీ, పీహెచ్సీల ఆవరణలో ఉన్న 60 డిస్పెన్సరీల భవనాల అభివృద్ధికి రూ. 16 కోట్లను కేంద్రం మంజూరుచేసింది. మరో 126 ఆయుర్వేద మందిరాల రికరింగ్ ఖర్చుల అవసరాలకు రూ. 5. 75 కోట్లను కేంద్రం కేటాయించింది.

# మారుమూల ప్రాంతంలో మానవీయ వెలుగులు



(మొదటి పేజీ తరువాయి)

మంత్రి అచ్చెన్న చొరవ చిర స్థాయిలో నిలవనుంది. ఏ నాయకుడికీ లేని విధంగా ఆయన ఆఫీసు వర్గాలు ఎప్పటికప్పుడు అప్రమత్తం అవుతూ బాధిత వర్గాలకు చెందిన సమాచారాన్ని విజయవాడకు చేరవేస్తూ, ఆరోగ్య సంబంధ సమస్యల పరిష్కారంలో ముఖ్యంగా కీలక శస్త్ర చికిత్సల సమయంలో చొరవ చూపి పని చేస్తుండడంతో మంత్రి అచ్చెన్నకు ఈ నియోజకవర్గంలో మరింత మంచి పేరు వస్తున్నది. ఇటీవలే ఆయన తీసుకున్న నిర్ణయాల కారణంగా.. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ఎక్కడా ఆలస్యం కాకుండా త్వరితగతన లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

**ఇతరుల ప్రమేయానికి తావే లేదు....అవసరం అయితే అచ్చెన్న మాట్లాడతారు**

ఒకప్పుడు గత ప్రభుత్వ పాలనలో మాదిరిగా ఇతరుల ప్రమేయం కూడా లేదు. అవసరం అయితే తానే స్వయంగా సంబంధిత కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. పేదలకు పెన్నిధిగా ఆయన నిలుస్తున్నారు. తమ అధినేత చంద్రబాబు మార్గ దర్శకాలు అందుకుని ఎప్పటికప్పుడు మానవీయ దృక్పథంతో పనిచేయడం తనకు ఎంతో ఆనందం ఇస్తోందని వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు చెబుతున్నారు. ఒకప్పటిలా ఆఫీసుల చుట్టూ తిరిగే అవస్థ అన్నది లేకుండా చేయడం కోసం మంత్రి అచ్చెన్న చేసి కృషి అనతి కాలంలోనే సత్ఫలితాలు వస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, సుదూర ప్రాంతాల నుంచి సాయం అంటూ వచ్చే వారికి తన ఆఫీసులో పట్టెడన్నం పెట్టి పంపుతుండడం కూడా విశేషం.

**అడుగడుగునా మానవీయ కోణం బాధితులకు అండగా ఉండేందుకేతొలి ప్రాధాన్యం**

వివిధ పనులపై కార్యాలయంకు వచ్చే వారికి ,నాణ్యమయిన భోజనం అందిస్తుండడం శుభ పరిణామం. ఇదే విషయమై మంత్రి అచ్చెన్న స్పందిస్తూ.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో ఏ ఒక్కరూ వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదన్న ఆశయంతో తన వంతు కృషి చేస్తున్నానని, ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఎంతగానో సహకారం అందిస్తున్నాయని తెలిపారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులు ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది పునరుద్ఘాటించారు.

# రాజధానికి రూ.2,047 కోట్లతో రైల్వేలైన్ ప్రతిపాదన..!


(మొదటి పేజీ తరువాయి)

కొత్త లైన్ ఉంటుంది. దీన్ని ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటించి భూసేకరణ ప్రక్రియ సైతం ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికోసం 2025–26 బడ్జెట్‌లో రూ. 171 కోట్లు కేటాయించారు.

‘కొత్త లైన్ల నిర్మాణం వల్ల రాష్ట్ర రాజధాని అమరావతికి రైల్వే అనుసంధానం కల్పించాలని రైల్వే శాఖ నిర్ణయించిందనీ. మంత్రి చెప్పటం విశేషం.

అమరావతి, విజయవాడ ప్రాంతాలకు రైలు అనుసంధానం పెంచడానికి ఇటీవల విజయవాడ–గుడివాడ–నరసాపురం, గుడివాడ–మచిలీపట్నం, భీమవరం–నిడదవోలు డబ్లింగ్ (221 కిలో మీటర్లు) ప్రాజెక్టులను కేంద్ర రైల్వే శాఖ ప్రారంభించింది. ఏపీ రాజధాని

అమరావతి, విజయవాడలకు అనుసంధానాన్ని మెరుగుపరచడానికి మరికొన్ని ప్రాజెక్టులు సైతం ఏర్పాటు చేయబోతున్నారు., అందులో భాగంగా విజయవాడ–గూడూరు 3వ లైన్ మొదలుపెట్టినట్లు చెప్పుకొచ్చారు. 287 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 248 కిలోమీటర్ల మేర పనులు కూడా పూర్తయ్యాయి. కాజీపేట–విజయవాడ మధ్య తలపెట్టిన 3వ లైన్ 220 కిలోమీటర్ల నిర్మాణంలో ఇప్పటికే 149 కిలోమీటర్ల కూడా పూర్తయినట్లు




అధికారులు చెబుతున్నారు. 2025–26లో ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 9,417 కోట్లతో బడ్జెట్ కేటాయించారు., ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటి గణాంకాల ప్రకారం 27 డబ్లింగ్, 12 కొత్త రైల్వే లైన్ల పనులు ఏపీ పరిధిలో. జరుగుతున్నాయి.

రైల్వేలైన్ల అనుసంధానం పెంపు: ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో రైల్వే లైన్ల అనుసంధానాన్ని పెంచేందుకు కోటిపల్లి–నరసాపురం మధ్య 57 కిలోమీటర్ల పొడవైన కొత్తలైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు

రూ. 2,120 కోట్ల కేటాయించారు. ఈ విషయాన్ని కేంద్రరైల్వే మంత్రి తెలిపారు. రాజమండ్రి బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కాకినాడ జనసేన ఎంపీ తంగిళ్ల ఉదయ్ శ్రీనివాస్ కూడా ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో ఈ రైల్వే లైన్ల గురించి ప్రస్తావించినట్లు తెలిసింది..

కోటిపల్లి–నరసాపురం మార్గంలో ముఖ్యమైన బ్రిడ్జిలు, భూసేకరణ పనులు ప్రస్తుతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి తీరప్రాంతంతో పాటు పోర్టులకు రైల్వే అనుసంధానాన్ని పెంచడానికి 6 లైన్ల సర్వేతో పాటు వాటి డీపీఆర్ తయారీకి అనుమతులు కూడా మంజూరు చేశారు. అందులో హరిదాస్‌పుర్–విజయనగరం 4వ లైన్ (450 కి.మీ.), నరసాపురం–మచిలీపట్నం కొత్త లైన్ (74 కి.మీ.), నిడదవోలు–దువ్వాడ 3, 4వ లైన్ (198 కి.మీ.), బాపట్ల–రేపల్లె కొత్తలైన్ (46 కి.మీ.), మచిలీపట్నం–రేపల్లె కొత్తలైన్ (45 కి.మీ.), కొత్తవలస–అనకాపల్లి బైపాస్ (35 కి.మీ.) లైనులు కూడా ఉన్నాయి.

ఈ రైల్వేలైను అన్ని ఏర్పాటయితే వివిధ ప్రాంతాలకు ఏపీలో కొద్ది మేర దూరం తగ్గడంతో పాటు ప్రయాణికులకు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు అవకాశాలు మెరుగుపడతాయి.

# జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు ఏ.సి. కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సహచర ప్రజానిధులు, అధికారులతో కలసి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.

ఈ ఎగ్జిబిషన్ లో గుంటూరుకు చెందిన పలు హోమ్ అప్లయెన్సెస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్టైల్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ప్రజలు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అధికారులు జీఎస్టీ 2.0లోని కొత్త నిబంధనలు, వినియోగదారుల రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక మైలురాయి. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలకు ఇవి నిజమైన వరంగా నిలుస్తున్నాయి. అవసరమైన ఉత్పత్తులపై పన్నులు తగ్గించడంతో వినియోగదారులు నేరుగా లాభపడుతున్నారు. తక్కువ పన్నులతో అందుబాటులోకి వస్తున్న వస్తువులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామిగా మారాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. జీఎస్టీ అమలు వల్ల పారదర్శకత పెరిగిందని, వ్యాపార రంగంలో విశ్వాసం నెలకొన్నదని. “ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయి. ప్రతి కుటుంబం ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను తెలుసుకొని ఉపయోగించుకోవాలి” అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.




# ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానానికి గౌరవం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల సుదీర్ఘ ప్రజా సేవా ప్రస్థానం పూర్తయిన సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చంద్రబాబు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ఆయన ఒక విజనరీ స్టేట్స్‌మన్, ఒక ప్రతిభావంతుడు శిల్పి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును ముందుగానే ఊహించి, ఆధునిక సాంకేతికతతో, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి విధానాలతో రాష్ట్రానికి దిశానిర్దేశం చేసిన గొప్ప నాయకుడు ఆయన. ఐటి రంగం ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన దార్శనికుడు, రైతుకు సాంకేతికతను చేరువ చేసిన సంస్కర్త, యువతకు అవకాశాల ద్వారాలు తెరిచిన మార్గదర్శి చంద్రబాబు అని అన్నారు. ఏ రంగంలో చూసినా ఆయన దూరదృష్టి, కష్టపడే తీరు, పారదర్శక పాలనకు నిదర్శనం. స్మార్ట్ ఆంధ్రప్రదేశ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్, ఈ–గవర్నెన్స్, వాటర్ మేనేజ్‌మెంట్, ఫార్మ్ టు మార్కెట్ లింకేజెస్ వంటి అంశాలను అమలుచేసి రాష్ట్రాన్ని ఆధునిక దిశగా నడిపించారు. ఆయన కలల అమరావతి రాజధాని ఆలోచన, గ్రామ సచివాలయాల భావన, రైతుల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన పథకాలు, ప్రజా కేంద్రిత ఆలోచనలకు ప్రతీకలు అని మంత్రి అభిప్రాయపడ్డారు. చంద్రబాబు గారు నాయకత్వం వహించే ప్రతి కాలం, ప్రతి నిర్ణయం ప్రజల జీవితాల్లో ఒక సానుకూల మార్పును తీసుకువస్తుంది. ఆయనలో ఉన్న సూక్ష్మ దృష్టి, పట్టుదల, పరిపాలన నైపుణ్యం, ప్రజాసేవా తపన ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి. దేశ స్థాయిలోనూ ఆయన చేసిన కృషి అనన్యసామాన్యం. అభివృద్ధి, నూతన ఆలోచనలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్న ఆయనకు ఈ రోజు మరొక మైలురాయి అని అన్నారు. ఆయన వంటి విజనరీ నాయకుడు మన రాష్ట్రానికి వరం. ఆయన పాలనలోనే ఆంధ్రప్రదేశ్ నిజమైన అర్థంలో సుజన పాలన, స్మార్ట్ రాష్ట్రం దిశగా పయనిస్తుంది అని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు మరెన్నో విజయాలు, సుదీర్ఘ ఆరోగ్యం లభించాలని, రాష్ట్ర ప్రజల సేవలో ఆయన తపన కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# 15 ఏళ్ల ఘనమైన ప్రస్థానం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానం విజయవంతంగా కొనసాగించిన సందర్భంగా రాజకీయ, మంత్రిత్వ వర్గాలు, పార్టీ నేతలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు దేశంలోని అత్యంత సమర్థవంతమైన ముఖ్యమంత్రుల్లో ఒకరు. ప్రాంతీయ పార్టీ నుంచి పదవి ప్రారంభించి 15 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందించడం అరుదైన ఘట్టమని అన్నారు. ఆయన పాలన ఇంకా 15 ఏళ్లపాటు కొనసాగాలని కోరారు.

విజన్ 2020, స్వర్ణాంధ్ర 2047, పీ4 వంటి ప్రాజెక్టులను సాకారం చేయడం ఆయన దూరదర్శి నాయకత్వానికి నిదర్శనం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనలో నూతన ప్రమాణాలను నెలకొల్పడం విశేషం అని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.


చంద్రబాబు నాయకత్వంలో, ఐటీ విప్లవం, అమరావతి పునర్నిర్మాణం వంటి ఘట్టాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. వినూత్న పాలన, పారదర్శకత, ఆధునిక సాంకేతికత వినియోగం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పెట్టుబడులకు ఆకర్షణ కల్పించడం ఆయన ప్రాధాన్యతలందని గుర్తుచేశారు.

మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, రైతు నుండి ఐటీ ప్రొఫెషనల్ వం–కు అందరికీ చేరువైన నాయకుడు చంద్రబాబు, గ్రామీణ అభివృద్ధి, నగరీకరణ, మహిళా సాధికారతలో నూతన దిశ చూపినారన్నారు.

హోం మంత్రి అనిత మాట్లాడుతూ, ప్రజలకే పాలనను చేరువ చేస్తూ సంక్షోభాలను సవాళ్లుగా మార్చి 15 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం పూర్తి చేయడం గొప్ప ఘట్టమని చెప్పారు. 2047 లక్ష్యాలను చేరేందుకు ఆయన దిశనిర్దేశం కావాలని ఆకాంక్షించారు.

మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, సాంకేతికత, పారదర్శకత, ప్రజా పాలనలో నూతన యుగానికి నాంది పలికిన నాయకుడు చంద్రబాబు అని అన్నారు. రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిలో నిలిపి, ఇన్ఫ్రాస్ట్రక్చర్, విద్య, వైద్యం, నీటి వనరులు, రోడ్ల అభివృద్ధి వంటి రంగాల్లో ప్రజలకు నాణ్యతా సేవలు అందించిన ఘనత ఆయనది అని తెలిపారు. రాజకీయ వర్గాలు, మంత్రులు, పార్టీ నేతలు చంద్రబాబు 15 ఏళ్ల ముఖ్యమంత్రి ప్రస్థానం ఘనంగా పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి బాదిత కుటుంబానికి నిధి



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అవకాశం లభించని రోగుల వైద్య సేవకు ముఖ్యమంత్రి సహాయనిధి బాధిత కుటుంబానికి ఒక నిధిలా తోడ్పడుతుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని సోమసుందరిపాలెం గ్రామానికి చెందిన వాకా పద్మావతి వైద్య సేవలు నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన మూడు లక్షల రూపాయల నగదు చెక్కును, శుక్రవారం రాత్రి, పద్మావతి కుమారుడు వాక అర్జున్‌కు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా, తమ కుటుంబానికి కష్టకాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికచేయూతనందిచడం, పట్ల, శ్రీకాంత్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# జగన్ ముక్కును నేలకు రుద్ది క్షమాపణలు చెప్పాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నర్సీపట్నం పర్యటన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆక్షేపణ తెలిపారు. నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలకు సంబంధించి తన సహజ లక్షణమైన అసత్యాలను వల్లెవేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి జగన్‌రెడ్డి విఫలమైన కృషి చేశారని మంత్రి వ్యాఖ్యానించారు.





**భూసేకరణే జరగలేదు...నిర్మాణ పనులెక్కడ?**

పార్వీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు, అందుకు సంబంధించిన ఫోటోలను పరిశీలిస్తే ఈ విషయం వెల్లడవుతుందని మాజీ సిఎం వ్యాఖ్యానించడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ఈ కాలేజీకి సంబంధించి అధికారంలో నుండి వైదొలగే దాకా జగన్‌రెడ్డి కనీసం భూసేకరణ కూడా చేయలేదని... ఈ వాస్తవాన్ని విస్మరించి ఆ కాలేజీ నిర్మాణంలో ఉన్నట్లు పట్టపగలు, బహిరంగంగా అబద్ధాలు చెప్పడం జగన్ కే సాధ్యమని మంత్రి నేడొక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

**నేను రాజీనామాకు సిద్ధం...నీవు క్షమాపణలు చెప్పగలవా?**

పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించి వాస్తవాల్ని వెలుగులోకి తేవడానికి మాజీ సిఎం తనకు ఇష్టమైన వారితో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఆ కమిటీ వాస్తవాల్ని పరిశీలించి భూసేకరణ జరిగి, నిర్మాణ పనులు జరుగుతున్నాయని నిర్ధారిస్తే... తాను వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని, లేకుంటే జగన్‌రెడ్డి తన ముక్కును నేలకు రుద్ది క్షమాపణలు తెలపాలని మంత్రి సూచించారు. ఈ సవాల్ ను స్వీకరించే నిజాయితీ, ధైర్యముంటే జగన్‌రెడ్డి వెంటనే స్పందించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదనపై ఆయన స్పందించకుంటే పార్వతీపురం కళాశాల విషయంలో జగన్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే ప్రజలను తప్పుదోవ పట్టించడానికి పూనుకున్నారని భావించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.

పిపిపి విధానంలో కొన్ని వైద్య కళాశాలల నిర్మాణంపై మాజీ సిఎం జగన్‌రెడ్డి పూర్తిగా అసత్యాల పునాదులపై ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అనుసరిస్తున్న కుట్ర పూరిత ధోరణికి పార్వతీపురం కాలేజీ నిర్మాణం గురించి ఆయన వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజలందరినీ కొంత కాలం, కొంత మందిని పూర్తికాలం మోసగించవచ్చు కానీ.... అందరినీ ఎల్లకాలం యామార్చలేమన్న విషయాన్ని జగన్‌రెడ్డి ఇప్పటికైనా గుర్తించాలని మంత్రి అన్నారు.

**నీవెంత ఖర్చు పెట్టావు....జగన్**

మొత్తం 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ వ్యయం రూ. 8,480 కోట్లలో... తాను అధికారంలోనుంచి వైదొలగేనాటికి రూ. 3,000 కోట్లు ఖర్చు చేశానని, కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ. 1,000 కోట్లు ఖర్చు చేసి మొత్తం నిర్మాణ పనులను పూర్తి చేయలేదా అని జగన్ ప్రశ్నించడంలోని అనౌచిత్యాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎత్తిచూపారు. ఈ విషయంలో కూడా మాజీ సిఎం అబద్దాల బాటనే ఎంచుకున్నారని మంత్రి ధ్వజమెత్తారు. నూతన కాలేజీల నిర్మాణ ప్రతిపాదనలను ప్రకటించిన అనంతరం మాజీ సిఎం నాలుగేళ్లలో కేవలం రూ. 1,550 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి వెల్లడించారు. ఈ వాస్తవాల ప్రకారం జగన్‌రెడ్డి సగటున ప్రతి ఏడాదీ చేసిన ఖర్చు కేవలం రూ. 387 కోట్లు మాత్రమేనని మంత్రి వివరించారు. వాస్తవాలు ఈ రీతిన ఉంటే... కూటమి ప్రభుత్వం దీనికి మూడు రెట్లు ఖర్చు చేయాలని ఏముఖంతో జగన్‌రెడ్డి అడిగారని మంత్రి నిలదీశారు.

నర్సీపట్నం కాలేజీ నిర్మాణ వ్యయం రూ. 500 కోట్లలో మాజీ సిఎం కేవలం రూ. 10.70 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఆ పెద్దమనిషి పార్వతీపురం కాలేజికి సంబంధించి కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా... ఉత్తరాంధ్ర ప్రజల పట్ల తన నిర్లక్ష్యం, వివక్షలను తనకుతానే బహిరంగపర్చుకుని, తగుదునమ్మా అంటూ నర్సీపట్నానికి జగన్‌రెడ్డి నీతిబాహ్యమైన పర్యటన చెయ్యడం ప్రజలను విస్మయానికి గురిచేసిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

జన్యుపరమైన లోపాల కారణంగా మాజీ సిఎంకు నిజాల్ని మాట్లాడడం, వాస్తవాల్ని గ్రహించడం, ప్రజల వివేక, విచక్షణలను గౌరవించడం గిట్టదని, ఈ వాస్తవాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రజలు 2024 ఎన్నికల్లో తగిన గుణపాఠాన్ని నేర్పారని, అయినా జగన్‌రెడ్డికి కనువిప్పు కలగడంలేదని, దీనికి తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# నడికుడి- శ్రీకాళహస్తి కొత్త రైలు సేవలు ప్రారంభం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని చరిత్రాత్మక ప్రాంతం, ఇప్పుడు ఒక కొత్త రైల్వే అధ్యాయంతో ఉత్సాహంగా మారింది. నడికూడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ మార్గంలో తొలి ప్రయాణికుల రైలు సేవలు జులై 4, 2025 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ కొత్త రైలు మార్గం పల్నాడు జిల్లా ప్రజలకు, ముఖ్యంగా న్యూ పిడుగురాళ్ల ప్రాంతవాసులకు, ఒక చిరకాల కల నెరవేరిన సందర్భం.

మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పవిత్ర తిరుపతికి వెళ్ళే ఈ స్పెషల్ రైలు (నెంబర్ 07189/07190) వారానికి ఒకసారి నడవనుంది. ఈ రైలు నాందేడ్ నుంచి శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు బయలుదేరి, బాసర, నిజామాబాద్, చర్లపల్లి, నడికుడి, న్యూ పిడుగురాళ్ల, రొంపిచర్ల, వినుకొండ, మార్కాపురం, నంద్యాల, కడప మీదుగా శనివారం మధ్యాహ్నం 12:30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, రైలు నెంబర్ 07190 తిరుపతి నుంచి శనివారం మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి, ఆదివారం ఉదయం 9:30 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది. న్యూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో ఈ రైలు అర్ధరాత్రి 12:30 గంటలకు ఆగనుంది, ఇది స్థానిక ప్రయాణికులకు తిరుపతి యాత్రను మరింత సులభతరం చేయనుంది. ఈ రైలులో స్లీపర్, 3ఏసీ, 2ఏసీ కోచ్‌లు అందుబాటులో ఉండటం వల్ల అన్ని వర్గాల ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం లభించనుంది. పల్నాడు ప్రజల్లో ఆనందం ఈ రైల్వే మార్గం గతంలో గూడ్స్ రైళ్ల కోసం మాత్రమే ఉపయోగించబడింది, కానీ ఇప్పుడు ప్రయాణికుల రైలు సేవల ప్రారంభంతో, పల్నాడు జిల్లా ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది. న్యూ పిడుగురాళ్ల, వినుకొండ, రొంపిచర్ల వంటి ప్రాంతాల ప్రయాణికులు ఇప్పుడు తిరుపతి బాలాజీ దర్శనం కోసం సులభంగా ప్రయాణించవచ్చు. ఈ కొత్త రైలు సేవలు ప్రారంభం కావడంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది, ఎందుకంటే ఇది వారి ప్రయాణ సౌలభ్యాన్ని గణనీయంగా మెరుగుపరచనుంది.

**నడికూడి-శ్రీకాళహస్తి కి కొత్త రైల్వే లైన్:**

నడికూడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ పల్నాడు జిల్లాకు ఒక ముఖ్యమైన అభివృద్ధి మైలురాయి. ఈ లైన్ పూర్తయిన తర్వాత గూడ్స్ ట్రయల్ రన్ విజయవంతంగా నడిచినప్పటికీ, ప్రయాణికుల రైలు సేవలు ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదు. ఇప్పుడు, ఈ స్పెషల్ రైలు ప్రారంభంతో, ఈ మార్గం పూర్తి స్థాయిలో ప్రయాణికుల సేవలకు తెరతీయనుంది. నాందేడ్–తిరుపతి స్పెషల్ రైలు పల్నాడు జిల్లా ప్రజలకు కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదు, ఇది వారి ఆధ్యాత్మిక యాత్రలను సులభతరం చేసే ఒక వరం. న్యూ పిడుగురాళ్ల, వినుకొండ, రొంపిచర్ల వంటి స్టేషన్లలో ఈ రైలు ఆగడం వల్ల స్థానిక ప్రయాణికులు తిరుపతి దర్శనం కోసం సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. ఈ కొత్త రైలు సేవలు పల్నాడు జిల్లా ప్రజలకు మరింత అనుసంధానం మరియు అభివృద్ధిని తీసుకొస్తాయని ఆశిద్దాం..

# హ్యాట్సాఫ్ సవితమ్మ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత మరోసారి తన మానవత్వాన్ని చూపారు. అధికార దర్పం కంటే ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే ఆమెకు అలవాటుగా మారింది. రోడ్డుపై ప్రమాదానికి గురై నిస్సహాయస్థితిలో పడివున్న వృద్ధుని లేపి, సపర్యాలు చేశారు. తన కాన్వాయ్ లోని వాహనంలోకి ఎక్కించి సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ దృశ్యాన్ని చూసిన వాహనదారులు, పాదాచారులు మంత్రి సవిత మానవత్వాన్ని కొనియాడారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో విజయవాడలో గాంధీ శిల్ప బజార్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించి, తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయానికి మంత్రి సవిత బయలుదేరారు. క్యాంపు కార్యాలయం సమీపంలోకి రాగానే విజయవాడ–గుంటూరు హైవేపై వడ్డేశ్వరం వైపు ద్విచక్ర వాహనంపై వృద్ధుడు వెలుతున్నాడు. తీవ్ర అనారోగ్యంతో వృద్ధుడు వెలుతున్న వాహనంపై నుంచి రోడ్డుపై పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అదే సమయంలో అటుగా వెలుతున్న మంత్రి సవిత... తన కాన్వాయ్ ను ఆపి, వృద్ధుడికి నీరు తాగించి సపర్యాలు చేశారు. 108 వాహనం వచ్చే వరకూ ఆగకుండా, కొద్దిగా తేరుకున్న వృద్ధుడిని తన ఎస్కార్ట్ వాహనంలో సమీపంలో ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. హైవే పై ప్రమాదం చోటుచేసుకోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎటువంటి అధికార దర్పం చూపకుండా మంత్రి సవిత స్పందించిన తీరు చూసి వాహనదారులు, పాదాచారులు కొనియాడారు. గతంలోనూ ఇదే రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలోనూ మంత్రి సవిత స్పందించిన తీరును గుర్తు చేస్తూ ప్రశంసలు కురిపించారు.

## స్విమ్మింగ్ తో శారీరక, మానసిక వికాసం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** స్విమ్మింగ్ తో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక శ్యామలనగర్ లోని ఎన్టీఆర్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్ లో జిల్లా స్థాయి ఈత పోటీలను ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవనంలో వ్యాయామం ఎంతో అవసరం అని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో ఉద్యోగాలలో ఒత్తిడి అధికంగా ఉంటుందని, దీన్ని అధిగమించేందుకు వ్యాయామం తప్పనిసరి అని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోజుల్లో కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ఎన్టీఆర్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్నో సంవత్సరాలుగా ఈతల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు ప్రస్తుతం జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు మంగళగిరిలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు చిన్నతనం నుంచే పిల్లలకు వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. వ్యాయామం ప్రాధాన్యతను తెలియజేయాలని అన్నారు.

# అమరావతిలో సెంట్రల్ లైబర్రీ నిర్మాణానికి వర్క్ షాపు

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిలో అద్భుతమైన అత్యాధునిక వసతులతో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. ప్రపంచ స్థాయి లో గుర్తింపు ఉండేలా ఐదు ఎకరాల స్థలంలో ఈ లైబ్రరీ నిర్మాణం ఉంటుందన్నారు. గతంలో హైటెక్ సిటీ నిర్మాణం ద్వారా వేలాది మందికి హైద్రాబాద్ లో ఉద్యోగాలు పొందారన్నారు. 2025లో నిర్మాణం చేయబోయే ఈ లైబ్రరీ కూడా భవిష్యత్ తరాలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా ఉంటుందన్నారు. ఇతర దేశాల్లో కూడా పలు లైబ్రరీలను సందర్శించి వచ్చానన్నారు. ఆ వివరాలతో పాటు, నిపుణుల అభిప్రాయాలను తీసుకుని అందరికీ నచ్చేలా మెచ్చేలా గ్రంధాలయం ఉంటుందన్నారు.





విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ దేశంలోనే అత్యాధునిక సెంట్రల్ లైబ్రరీ ని అమరావతిలో నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నమూనా ఎలా ఉండాలి, ఏ విధంగా రూపకల్పన చేయాలనే అంశాలపై వర్క్ షాపు నిర్వహించామన్నారు. అనేక ప్రాంతాల నుంచి నిపుణులైన ఆర్కిటెక్చరర్లు వచ్చారన్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, సాఫ్ట్ వేర్ లకు సంబంధించిన అంశాలను నిపుణులు వివరించారన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని లైబ్రరీలకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు తీసుకోవాల్సిన అంశాలపై నైపుణ్యం కల్గిన వారి నుంచి, వివిధ యూనివర్శిటీ ప్రొఫెసర్ల నుంచి అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. వచ్చే రెండేళ్ళల్లో ఈ సెంట్రల్ లైబ్రరీ దేశానికే ఆదర్శంగా ఉండబోతుందన్నారు.. ఈ గ్రంధాలయం నిర్మాణం కోసం త్వరలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిజైన్ కాంపిటేషన్స్ నిర్వహిస్తామన్నారు.. ప్రముఖ ఆర్కిటెక్చర్లు కూడా ఈ పోటీలో పాల్గొని వివిధ నిర్మాణ ఆకృతులను కూడా అందించ వచ్చునన్నారు. అనంతరం అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, అద్భుతమైన డిజైన్ తో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం రెండేళ్లలో పూర్తి అయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ తెలియజేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర మౌలిక వసతులు కల్పన బోర్డు చైర్మన్ రాజశేఖర్, విద్యా శాఖ కమిషనర్ విజయ రామరాజు, గ్రంథాలయ సంస్థ బోర్డు డైరెక్టర్ డైరెక్టర్ రాసాని పద్మజ, రామూర్తి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కృష్ణ మోహన్, తదితరలు పాల్గొన్నారు.

# అనుపర్రు బీసీ వసతి గృహ విద్యార్దులను పరామర్శించిన మంత్రి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** పెదనందిపాడు మండలం అనుపర్రు బీసీ బాలుర వసతి గృహంలో అస్వస్థతకు గురి అయిన విద్యార్థుల ఆరోగ్యం పూర్తిగా నిలకడగా ఉందని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు.



పెదనందిపాడు మండలం అనుపర్రు బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో అస్వస్థతకు గురై గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శుక్రవారం రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత, ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి పరామర్శించారు. జీజీహెచ్ లోని పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మంత్రి ఎస్ సవిత మాట్లాడి ఆరోగ్య వివరాలు, అస్వస్థతకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని చెప్పారని, త్వరలోనే డిస్చార్జి చేస్తారని విద్యార్థులకు మంత్రి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత విలేకరులతో మాట్లాడుతూ పెదనందిపాడు మండలం అనుపర్రు బీసీ బాలుర వసతి గృహంలో 108 మంది విద్యార్థులు ఉండగా శుక్రవారం 56 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి అయ్యారన్నారు. అధికారులు వెంటనే స్పందించి స్థానికంగా విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించారని, జ్వరం ఉన్న 16 మందిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించటం జరిగిందన్నారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగ ఉందని, కొంతమందిని డిస్చార్జ్ చేయటం జరిగిందన్నారు. బీసీ సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు అస్వస్థతకు గురైన సమాచారం తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్యాబినేట్ సమావేశంలో ఉన్న బీసీ వెల్ఫేర్ డైరక్టర్ ను వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించటం జరిగిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిపై ప్రత్యేకంగా మాట్లాడటం జరిగిందన్నారు. బీసీ సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులు అస్వస్థతకు గురి అవటం బాధకరమని ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృత్తం కాకుండా అవసరమైన అన్నిచర్యలు పకడ్బందీగా తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు సంక్షేమ హాస్టల్స్ నిర్వహణను గాలికి వదిలివేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్ లో అవసరమైన మౌలికసౌకర్యాలు కల్పించటానికి నాణ్యమైన భోజనంతో పాటు, విద్యను అందించేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

ప్రత్తిపాడు శాసనసభులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ పెదనందిపాడు మండలం అనుపర్రు గ్రామంలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురి అయ్యారన్న సమాచారం తెలిసిన వెంటనే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయటంతో పాటు స్థానిక నాయకుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వసతి గృహంలో గురువారం రాత్రి భోజనం లేదా, నీటి కారణంగా విద్యార్థులకు అస్వస్థతకు గురి అయ్యి ఉండవచ్చని తెలిసిందన్నారు. విద్యార్థులు ఆసుపత్రి వాతవరణం వలన అందోళన చెందుతారని స్థానికంగా ఉన్న ఏసీ కళ్యాణ మండపంలో ఉంచి ప్రాథమిక వైద్య చికిత్స అందించటం జరిగిందని, జ్వరం ఉన్న 18 మంది విద్యార్థులను జీజీహెచ్ కు తీసుకురావటం జరిగిందని వివరించారు. జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వెంటనే సంఘటన స్థలానికి వెళ్ళి జిల్లా వైద్యశాఖ అధికారులను, జీజీహెచ్ వైద్యులను అప్రమత్తం చేసి అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన చికిత్సను అందించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. విద్యార్థులందరి ఆరోగ్యపరిస్థితి నిలకడ ఉందని, భవిష్యత్ లో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వర రావు, బీసీ వెల్ఫేర్ ఎక్స్ అఫిషియో సెక్రెటరీ ఎస్. సత్యనారాయణ , జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్ ఎస్ వి రమణ , బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఖనిజాల నిక్షేపాలు

**ఐదు జిల్లాల్లో గ్రానైట్, సున్నపురాయి తవ్వకాల కోసం సర్కార్‌కు ప్రతిపాదనలు**

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** ఇసుకతో పాటు, ఇతర మినరల్స్ తవ్వకాలను చేపట్టేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రస్తుతం ఒక్క ఇసుక విక్రయాలు మాత్రమే నిర్వహిస్తుండా, మిగిలిన ఖనిజాలను టెండర్ల పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు కేటాయింపులు చేస్తోంది. అయితే అనుమతి పొంది సంబంధిత ఖనిజ తవ్వకాలను చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నట్లు సంస్థ గుర్తించింది. దీంతో ఇసుకతో పాటు, ఇతర ఖనిజాలను కూడా సంస్థ ద్వారా చేపట్టాలని నిర్ణయించింది.

ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఖనిజ అభివృద్ధి సంస్థ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. రాష్ట్రంలో ఇసుకతో పాటు, డోలమైట్, గ్రానైట్, సున్నపురాయి, మార్బుల్, మైకా తదితర ఖనిజాల నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినట్లయితే వీటన్నింటినీ ఇక నుండి సొంతంగానే తవ్వకాలు జరిపాలని అధికారులు నిర్ణయించారు. కాగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీగా గ్రానైట్, సున్నపురాయి నిల్వలు ఉన్నట్లు బయటపడింది. ఈ మేరకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో రాష్ట్రంలోని 5 జిల్లాల్లో గ్రానైట్, సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. ప్రధానంగా కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ నిల్వలు భారీగా ఉన్నట్లు తేల్చింది. కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, ఖమ్మం జిల్లాలో కొత్తగట్టు, నమిలికొండ, వెంతడుప, తాళ్లపూసపల్లె తదితర ప్రాంతాల్లో 83.25 హెక్టార్ల విస్తీర్ణంలో 28,400 క్యూబిక్ మీటర్లలో తెలుపు, బ్రౌన్, నలుపు రకాలకు చెందిన గ్రానైట్ నిల్వలు ఉన్నాయి.

అదేవిధంగా నల్లగొండ, సూర్యాబాద్, వికారాబాద్ జిల్లాల్లో సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు కనుగొంది. ఆయా జిల్లాల్లోని సూర్యాపేట్ జిల్లాలోని మేళ్లచెర్వు, మఠంపల్లి, రఘునాథపాలెం, రామాపురం, దొండపాడు, నల్లగొండ జిల్లా తామరచెర్ల, వికారాబాద్ జిల్లా మల్కాపూర్, జివాంగి ప్రాంతాల్లో 276.83 కిలోమీటర్ల విస్తీర్ణంలో సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు గుర్తించింది.

ఈ మేరకు వీటికి సంబంధించిన తాజాగా నివేదికను ఖనిజాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి సమర్పించింది. ఇదే సమయంలో ఈ నిక్షేపాలను తవ్వేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది.

## బిసి బాలికల హాస్టల్‌లో ముగ్గురు మిస్సింగ్

### నిజామాబాద్ జిల్లాలో కలకలం

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** నిజామాబాద్ జిల్లాలోని బిసి బాలికల హాస్టల్‌లో ముగ్గురు బాలికలు మిస్సింగ్ అయిన ఘటనతో జిల్లాలో కలకలం రేపుతోంది. కోటగల్లి బాలికల పాఠశాలలో వెనకబడిన తరగతుల వసతి గృహం నుంచి ముగ్గురు బాలికలు తప్పిపోయినట్లు తెలిసింది. రెండవ టౌన్ ఎస్ఐ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బిసి బాలిక వసతి గృహానికి చెందిన 10వ తరగతికి చెందిన ఇద్దరు, 9వ తరగతికి చెందిన ఓ విద్యార్థిని బుధవారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని.. కనిపించకుండా పోయారని హాస్టల్ వార్డెన్ రెండవ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వసతి గృహంలోని సిసి కెమెరాలను పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## తెలంగాణకు మినరల్ రీసెర్చ్ సెంటర్లు

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణకు కీలకమైన ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఇండియాలోనే అత్యవసరంగా కావాల్సిన కీలక ఖనిజాలపై జరగనున్న ఏడు రీసెర్చ్ సెంటర్లను కేంద్ర ఏర్పాటు చేస్తోంది. వాటిల్లో రెండు రీసెర్చ్ సెంటర్లను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కీలకమైన నిర్ణయాన్ని కేంద్రం తీసుకుంది. ఈ రెంటిలో ఒకటి ఐఐటి హైదరాబాద్ కాగా, మరొకటి రాష్ట్రంలోని హాకీంపేట్‌లో గల నాన్స్ ఫామ్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎన్ఎఫ్‌టిడిసి)లో క్రిటికల్ మినరల్ రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఇప్పుడున్న టెక్నాలజీతో పాటు, ఫ్యూచర్‌కి కావాల్సిన ఎనర్జీ, బ్యాటరీలు, స్పేస్ లాంచ్‌లు, డిఫెన్స్ టెక్నాలజీ ఇవన్నీ ఓ ప్రత్యేకమైన మినరల్స్ మీదే ఆధారపడి ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే కేంద్రం నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ఏర్పాటు చేసింది. ఈ మిషన్ కింద రూ16,300 కోట్లు బడ్జెట్ కేటాయింపులు జరిపింది. ఇవే కాకుండా మరో రూ.18 వేల కోట్లు పీఎస్‌యూల నుంచి తీసుకోనుంది. మొత్తం దేశాన్ని కవర్ చేసేందుకు ఏడేళ్ల ప్లానింగ్ రెడీగా ఉంది. ఈ ప్లాన్‌లో భాగంగానే దేశవ్యాప్తంగా 7 సెంటర్స్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తోంది. ఐఐటీలు, సైన్స్ ఇన్‌స్టిట్యూట్లతో కలిసి హార్డ్‌కోర్ సీసెర్చ్ చేయనుంది. దేశ భద్రత, ఎనర్జీ భద్రత, స్పేస్ రంగాలు వంటి మల్టీ బిలియన్ డాలర్ టెక్ రంగాల్లో ముందుకు వెళ్లాలంటే, ఈ రిసెర్చ్ సెంటర్లు ఎంత అవసరమనే ప్రధాన లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తోంది.

## భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి : గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



రజతోత్సవాల ప్రత్యేక సంచికను విడుదల చేసిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (సికిందరాబాద్), అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** భారతీయుల జీవన ప్రమాణాలు, సనాతన ధర్మం, సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, అవి మన వేదవిజ్ఞానంతో ముడిపడి ఉన్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మన ప్రాచీన సంస్కృతి, అసలైన దేశ చరిత్ర నేటితరం తెలుసుకోవాలని ఆయన సూచించారు. పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయంలో జరుగుతున్న జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా తెలంగాణ వేదవిద్వాన్ మహాసభల నిర్వా హకులను ఆయన అభినందించారు. రజతోత్సవాల ప్రత్యేక సంచికను ఆయన విడుదల చేశారు. శ్రీస్కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయం చైర్మన్ ఎల్వీ సుబ్రమణ్యం, జనార్ధనానంద సరస్వతిస్వామి సంస్కృతి ట్రస్ట్ చైర్మన్ తూములూరి సాయి నాథశర్మ, కార్యదర్శి బ్రహ్మానందశర్మ, చింతపల్లి సుబ్ర మణ్యం, ఎన్వీ శ్రావణ్ పాటు పలువురు ప్రముఖులు, వేదపండితులు పెద్దఎత్తున హాజరయ్యారు.

## బిసిలకు పెంచిన రిజర్వేషన్ జాప్యానికి కేంద్రంలోని బిజెపిదే బాధ్యత

### సిపిఐ, సిపిఎం రాష్ట్ర కమిటీలు

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టులో స్టే రావడం తీవ్ర నిరాశకు గురి చేసిందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బిసిలకు పెంచిన రిజర్వేషన్ జాప్యం జరగడానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అన్నారు. శాసనసభలో బిజెపి సహా అన్ని పక్షాలు రెండు సార్లు బిసి రిజర్వేషన్ 42 శాతానికి పెంచే బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించాయని, దాంతో పాటు రిజర్వేషన్ పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ కూడా ఉందన్నారు. ఈ మూడింటిని రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ వద్దకు పంపినప్పటికీ, వాటిని గవర్నర్ కేంద్రానికి పంపగా, అక్కడే పెండింగ్‌లో ఉన్నాయని కూనంనేని మండిపడ్డారు. కేంద్రం వద్ద శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు నెలలు తరబడి పెండింగ్ ఉన్నందునే.. గురువారం స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి కారణమైందన్నారు. దీనికి పూర్తి బాధ్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదేనని అన్నారు. తక్షణమే శాసనసభ ఆమోదించిన స్థానిక సంస్థలు, ఉద్యోగ, విద్య రంగాలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పన బిల్లులను ఆమోదిస్తే, ఎలాంటి ఆటంకాలు లేకుండా పెంచిన రిజర్వేషన్ ఎన్నికలు యథావిధిగా నిర్వహించవచ్చన్నారు. ఇందుకోసం బిజెపి రాష్ట్ర నాయకులు ఇప్పటికైనా చొరవ చూపాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే జిఒ 9పై వేసిన రిట్ పిటిషన్ కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలైన కేసుల్లో సిపిఐ తరుపున ఇంప్లీడ్ అయ్యామని, హైకోర్టు తాజా స్టే నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ కార్యాచరణ చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్‌పై స్టే రావడం, బిసిలకు పెంచిన రిజర్వేషన్ అమలు జరపకుండా జాప్యం కావడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధాన కారణమని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. బిసిలకు బిజెపి ద్రోహం చేసిందన్నారు. ఇప్పటికే శాసనసభలో బిసి రిజర్వేషన్ 42 శాతానికి పెంచే బిల్లులను అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించిందని, అలాగే రిజర్వేషన్ పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ కూడా ఉందన్నారు. కేంద్రం వద్ద శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు నెలలు తరబడి పెండింగ్ ఉన్నందునే స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి కారణమైందని సత్యం విమర్శించారు.

**బిసి వ్యతిరేక బిజెపిని గద్దె దింపాలి: సిపిఎం**

రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకు వ్యతిరేకంగా ఉన్న బిజెపిని గద్దె దింపాలని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద గురువారం హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచి పోయాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మండిపడానడరు. ఇందుకు ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని.. ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు, మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధమైన చర్యలన్నీ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బిసి రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను నిరసిస్తూ..

# రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

**బిసి, కుల సంఘాలు, అఖిలపక్షాలతో నేడు భేటీ**

**అనంతరం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం: జాజుల**

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** బిసి రిజర్వేషన్లపై హైకోర్టు విధించిన స్టేను నిరసిస్తూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్టు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బిసి రిజర్వేషన్ల చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో బిసి రిజర్వేషన్లు చేరిస్తే న్యాయపరమైన అవరోధాలు ఉండేవి కావని బిసి రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలన్నీ డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. ఒక పార్టీ మీద ఇంకొక పార్టీ నేపం నెట్టడమే తప్ప బిసిలకు నిజమైన మద్దతు ఇవ్వడం లేదన్నారు. శుక్రవారం హైదరాబాదులో బిసి సంఘాలు, కుల సంఘాలు, మేధావులతోపాటు అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హైకోర్టు తీర్పు అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. చట్టబద్ధంగా పెంచిన బిసి రిజర్వేషన్ల జీవోపై రాష్ట్ర హైకోర్టు స్టే ఇవ్వడాన్ని బిసి సంక్షేమ సంఘం తీవ్రంగా నిరసిస్తుందని, ఇది బిసి వ్యతిరేక చర్యగా భావిస్తున్నామన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు కింది నుంచి పై కోర్టుల వరకు బిసి రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారి కోర్టులను వేదికగా చేసుకుని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. కోర్టులు కూడా బిసిలకు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. బిసి రిజర్వేషన్లు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ నేడు రాష్ట్రంలో ఎక్కడికక్కడ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి బిసిలు తమ నిరసనను వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్ల చట్టాన్ని రాష్ట్ర గవర్నర్ ఆమోదించి ఉంటే రాష్ట్ర హైకోర్టులో రిజర్వేషన్లపై స్టే వచ్చే అవకాశం లేదన్నారు.

గవర్నర్ ఆమోదం కనుక ఉంటే రాష్ట్ర హైకోర్టులో స్టే వచ్చేది కాదన్నారు. బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ పద్ధతి దక్కడానికి మొదటి నుండి బిసి సమాజమంతా 9వ షెడ్యూల్లో చేర్చాలని, కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నప్పటికీ బిజెపి నేతలు బిసి రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని పదేపదే బిసి సమాజాన్ని తప్పుదోవ పట్టించారని గుర్తు చేశారు. బిజెపి నేతలు రాష్ట్ర గవర్నర్ను కలిసి ఉంటే గవర్నర్ సానుకూల నిర్ణయం తీసుకునే వారనీ.. కానీ బిజెపి ఇదేమి చేయకుండా బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని అనడం సిగ్గుచేటన్నారు. నేడు హైదరాబాదులో అన్ని బిసి సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, అఖిలపక్ష రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.

సమావేశంలో బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, దాసు సురేష్, విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కురుమ, మనీ మంజరి, నరేష్ ప్రజాపతి, నరసింహా నాయక్, జాజుల లింగం, శేఖర్ సగర, గొడుగు మహేష్ యాదవ్ ఈడిగ శ్రీనివాస్ గౌడ్, మాదేశి రాజేందర్, కవుల జగన్నాథ పానుగంటి విజయ్, వరికుప్పల మధు, మల్లికార్జున యాదవ్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు

**వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో రైతులు పండించిన మొక్కజొన్నను మద్ధతు ధరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్నను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఈ మేరకు దీనికి సంబంధించి గురువారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో 6,24,544 ఎకరాల్లో మొక్కజొన్న సాగు అయిందని, సగటున ఎకరాకు 18.50 క్వింటల్ దిగుబడి వచ్చి, మొత్తం 11.56 లక్షల టన్నుల దిగుబడి అవుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 8.66 లక్షల టన్నుల మొక్కజొన్నలను కొనుగోలు చేయాల్సి ఉంటుం దని అంచనా వేశామన్నారు. ఇందుకు గాను ప్రభుత్వంపై 2,400 కోట్ల రూపాయల భారం పడుతుందని వెల్లడించారు. గత నెల 3 వ వారం నుండే మార్కెట్లోకి భారీగా మొక్కజొన్న పంట రావడం వలన ధరలు తగ్గిపోయాయని వివరించారు. ప్రస్తుత మార్కెట్ ధరలు మద్దతు ధర క్వింటాలుకు 2,400 రూపాయలు ఉండగా, దానికన్నా 441 రూపాయలు తక్కువగా ఉందని చెప్పారు. దీని వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. రైతులు మొక్కజొన్నను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, మద్దతు ధర పొందవలసిందిగా సూచించారు. తక్కువ ధరలకు ప్రైవేట్‌లో కాకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని కోరారు. గతేడాది కేంద్రం మద్ధతు ధరకు సేకరించనప్పటికి రాష్ట్ర ప్రభు త్వమే దాదాపు 535 కోట్లు రూపాయలు ఖర్చు పెట్టి జొన్న పంటను మద్ధతు ధర చెల్లించి కొనుగోలు చేసిందన్నారు. అదేవిధంగా పెసర, మినుము, సోయాచిక్కుడు, కంది, వేరుశనగ లాంటి పంటలపై కేంద్రం 25 శాతం సీలింగ్ విధించిందని ఇది రైతులకు అడ్డంకిగా మారు తుందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

## నార్త్ అమెరికాలో సిపిఎ కాన్ఫరెన్స్‌కు మండలి చైర్మన్ గుత్తా, స్పీకర్ ప్రసాద్ హాజరు

**10(జర్నలిస్ట్‌ఫైల్): ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు** నార్త్ అమెరికా ఖండంలోని బార్బడోస్ దేశ రాజధాని బ్రిడ్జిటౌన్ లో జరుగుతున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసి యేషన్ (సిపిఏ) కాన్ఫరెన్స్‌లో గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి.నరసింహా చార్యులు, అధికారులు పాల్గొన్నారు.

మొదటిరోజు జరిగిన రిజిస్ట్రేషన్, పరిచయ కార్యక్రమాలలో భారతదేశ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, రాష్ట్రాల స్పీకర్లు, చైర్మన్లతో కలిసి తెలంగాణ శాసన మండలి బృందం పాల్గొన్నది.



# మైక్రో ఇరిగేషన్‌కు సబ్సిడీ

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** సబ్సిడీ ఇవ్వడంతో పాటు జీఎస్టీ తగ్గింపు నిర్ణయాలతో తెలంగాణలో రైతులకు మైక్రో ఇరిగేషన్ పథకాలు అందుబాటులోకి వస్తున్నాయి. డ్రిప్ పరికరాలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతర పేద రైతులకు 80 శాతం వరకు సబ్సిడీని అందిస్తోంది. ప్రధానంగా ఏడేండ్లుగా నిలిచిపోయిన మైక్రో ఇరిగేషన్ పథకాలను అమలు చేసేందుకు రాష్ట్ర సర్కార్ చర్యలు చేపట్టింది. మైక్రో ఇరిగేషన్ నిమిత్తం రాష్ట్రం తన వంతు వాటాను గత బడ్జెట్లో కేటాయించింది. నాబార్డు రుణ సాయం కూడా అందుబాటులోకి రానుంది. ఇరిగేషన్ మేనేజ్మెంట్ ట్రాన్స్ఫర్ (ఐఎంటీ) సొసైటీలు, ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్పీఓ), ప్రాథమిక సహకార సంఘాల (పీఏసీఎస్) సహకారంతో ఈ పథకాన్ని నిర్వహించనున్నారు. ఈ పథకాలకు ఐదేండ్ల పాటు ప్రభుత్వం సాయం అందించడంతో పాటు, పైప్‌లైన్ ఏర్పాటుకు 60 శాతం సబ్సిడీ ఇవ్వనుంది.

ముఖ్యంగా మెట్ట ప్రాంతాలు, నీటి కొరత ఉన్న మండలాల్లో డ్రిప్ వ్యవస్థ రైతులకు ప్రయోజనకారిగా ఉంటుందని. డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థతో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించొచ్చు. చెరుకు, పత్తి, మిరప, పొగాకు, కూరగాయలు, పూలతోటలు, ఆయిల్పామ్ వంటి పంటలకు డ్రిప్ ఇరిగేషన్ అనుకూలంగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

# ఆర్‌టిఐని యువత ఆయుధంగా గుర్తించాలి

**చట్టాలపై అవగాహనతో సామాజిక మార్పు**

**సదస్సులో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి**

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** సమాచార హక్కు చట్టం(ఆర్‌టిఐ)ని యువత ఆయుధంగా గుర్తించాలని, చట్టాలపై అవగాహనతో సామాజిక మార్పు వస్తుందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5 నుంచి 12 వరకు నిర్వహిస్తున్న ఆర్‌టిఐ అవగాహన వారంలో భాగంగా గురువారం హోలీమేరి కాలేజీలో నిర్వహించిన ఆర్టీఐ సదస్సులో మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే యువత అకడమిక్ ర్యాంకుల కోసమే కాకుండా, సామాజిక స్పృహకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమాజంలో జరిగే పరిణామాలపై స్పందించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అందులో భాగంగా సమాచార హక్కు చట్టం వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు.

యువత భాగస్వామ్యం ఎక్కువగా ఉన్న భారత్‌లో వజ్రాయుధంలా ప్రజల ముందుకొచ్చిన సమాచార హక్కు చట్టంపై విద్యార్థులు అవగాహన పొందాలన్నారు. ఈ తరహా చైతన్యం యువత పొందడం వల్లే 135 దేశాల్లో ఆర్‌టిఐ యాక్ట్ బలోపేతమైందన్నారు. ఎన్జీవోలు, పౌర సమాజం పోరాటాల ఫలితంగా అందుబాటులోకి వచ్చిన ఈ చట్టాన్ని యువత భాగస్వామ్యంతోనే మరింత ముందుకు తీసుకెళ్ళొచ్చన్నారు. ఆర్‌టిఐపై విద్యార్థులు గ్రామీణ స్థాయిలో నిరక్షరాస్యులను మేల్కొల్పాలని బాలకిష్టారెడ్డి సూచించారు. కాలేజీ ఫౌండర్ చైర్మన్ అరమంద వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌టిఐపై అవగాహన పొందడం అంటే చట్టాలపై అధిపత్యం సాధించడమేనన్నారు. కాలేజీ విద్యార్థులకు ఈ చట్టంపై ఆసక్తి పెరిగేలా చేస్తామన్నారు.

ఆర్‌టిఐలోని సెక్షన్లన్నీ విద్యార్థులు ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని, సామాజిక మాధ్యమాల ద్వారా దీన్ని వ్యాప్తి చేయాలని కాలేజీ చైర్మన్ డాక్టర్ అరిమంద సిద్ధార్థరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ డాక్టర్ అరిమంద విజయశారద రెడ్డి, డాక్టర్ రవితేజ, ప్రిన్సిపల్, జెవివి సుబ్రహ్మణ్యంతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్పీడిసిఎల్ చీఫ్ ఇంజినీర్‌పై సస్పెన్షన్ వేటు

### ప్రధాన కార్యాలయంలో కొందరిదే ఇష్టారాజ్యం

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల్లో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంతో పాటు, సంస్థ సిఎండి ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాము చెప్పిందే వేదం, తమకు నచ్చినవే నిబంధలంటూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారనే అపవాదు ఉంది. ఈ విధంగానే తన సొంత ఎజెండాతో ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న చీఫ్ ఇంజనీరుపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రధాన కార్యాలయంలోని ఎనర్జీ ఆడిట్ విభాగంలో పనిచేస్తున్న ఆర్టిజన్‌ను ప్రభుత్వ ఇంధన శాఖకు బదిలీ చేస్తూ ఈ ఏడాది మే 2వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి ఈ ఉద్యోగిని తక్షణమే రిలీవ్ చేయాల్సిందిగా చీఫ్ ఇంజనీర్ ఎనర్జీ ఆడిట్‌ను ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సదరు ఉద్యోగిని రిలీవ్ చేయాల్సిందిగా గత ఐదు నెలలుగా పలువురు ఉన్నతాధికారులు చీఫ్ ఇంజనీర్ ను మోఖికంగా పలుమార్లు కోరడం జరిగింది. అయినా ఉత్తర్వులను, ఉన్నతాధికారుల ఆదేశాలను పక్కన పెట్టి బదిలీ చేసిన ఉద్యోగిని రిలీవ్ చేయకుండా తన స్వంత ఎజెండాతో వ్యవహరించారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం, తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం, అవిధేయతకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని సదరు చీఫ్ ఇంజనీర్ (ఎనర్జీ ఆడిట్) పై సస్పెన్షన్ వేటు వేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.




గాంధీభవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

## బిఆర్ఎస్ చలో బస్‌భవన్ హాస్యాస్పదం

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** చలో బస్‌భవన్ అంటూ బిఆర్ఎస్ నేతలు హడావిడి చేయడం హాస్యాస్పదమని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ఉనికి కోసమే బిఆర్ఎస్ నాయకులు నాటకాలు వేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో బంద్‌లు, ధర్నాలు, నిరసనలపై ఉక్కు పాదం మోపారని, వారికి చలో బస్‌భవన్ అంటూ పిలుపునిచ్చే హక్కు లేదని అన్నారు. ఆర్టీసీ విషయంలో బిఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు, కెసిఆర్ పదేళ్ల కాలంలో ఆర్టీసీని సర్వనాశనం చేశారని ఆరోపించారు. బస్‌భవన్‌కు బయలుదేరే ముందు కెసిఆర్ ముక్కు నేలకు రాసి ఆర్టీసీ సిబ్బంది, కార్మికులకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 2019 సమ్మె సమయంలో కెసిఆర్ మొండివైఖరి, నాటి మంత్రుల మూర్ఖపు వాదనలతో ఆర్టీసి డ్రైవర్లు ఆవుల నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీసీ కండక్టర్ సురేందర్‌గౌడ్ ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. రాణిగంజ్ డిపోలో కండక్టర్‌గా పనిచేసే సురేందర్‌గౌడ్ 2018లో తన బిడ్డ పెళ్లికి బ్యాంకులోన్ తీసుకున్నారనీ, 2019 సమ్మె సమయంలో సెప్టెంబర్ జీతం ఇవ్వకపోవడంతో ఇఎంఐకు సంబంధించిన చెక్కు బౌన్స్ అవడంతో ఒత్తిడికి గురై సురేందర్‌గౌడ్ ఉరిపెట్టుకొని చనిపోయారని అద్దంకి వివరణ ఇచ్చారు. సమ్మె సమయంలో వరుసగా రెండు నెలలు జీతం ఇవ్వక పోవడంతో మహబూబాబాద్ డిపో పరిధిలో డ్రైవర్ ఆవుల నరేశ్ పురుగుల మందు తాగి చనిపోయారని ఆత్మహత్యల కారాణాలు దయాకర్ ఎకరువుపెట్టి చెప్పారు.

## ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు రూపొందించి ఇహెచ్‌ఎస్‌ను అమలు చేయాలి

### సిఎస్‌కు రాష్ట్ర ఉద్యోగుల జెఎసి విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఆరోగ్య పథకం విధివిధానాలను రూపొందించి ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. టిజిఈజేఏసీ నేతలు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుని సచివాలయంలో కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం గురించి కోరారు. టిజిఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరి జనరల్ ఏలూరి శ్రీనివాసరావుల అధ్వర్యంలో జేఏసీ ప్రతినిధి బృందం సిఎస్‌ని కలసి పలు సమస్యారం కోసం విజ్ఞప్తి చేశారు. అందులో ప్రధానంగా.. ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు రూపొందించి ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఒక డి.ఎ.ని విడుదల చేయాలని కోరారు. దాంతోపాటు వెంటనే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను సమావేశపరచి మిగిలిన సమస్యలపైనా చర్చించి వాటిని కూడ పరిష్కరించాల్సింగా కోరారు. ఈ కార్యక్రమములో జేఏసీ నేతలు దామోదర్ రెడ్డి, వంగ రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సదానంద్ గౌడ్, కటకం రమేష్, ముజీబ్ హుస్సేన్, కస్తూరి వెంకటేశ్వర్లు, బి. శ్యామ్, శ్రీనివాస్ రెడ్డి, దాస్య నాయక్, ప్రేమ్ పాల్గొన్నారు.

## సమాచార హక్కు అవార్డు ఎక్సైజ్ సిబ్బందికి అంకితం : కమిషనర్

**హైదరాబాద్, అక్టోబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** సమాచార హక్కు అవార్డు ఎక్సైజ్ ఉద్యోగులందరికీ అంకితం ఇస్తున్నా అని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి హరికిరణ్ తెలిపారు. సమాచార హక్కు చట్టం 2025లో భాగంగా బెస్ట్ పర్ఫార్మెన్స్ హెడ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ కింద ఎక్సైజ్ శాఖకు 2025 సమాచార హక్కు చట్టం అవార్డును గవర్నర్ చేతుల మీదుగా కమిషనర్‌కు అందించారు. వచ్చిన అవార్డును ఎక్సైజ్ శాఖ ఉద్యోగులందరికీ అంకితమిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్ పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాల్లో ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ శాఖ నుంచి సమాచార హక్కు కింద.. వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి నందుకు, ఆర్టిఐ చట్టం కింద అడిగిన దరఖాస్తులకు సమాచారం అందించడం వల్ల ఈ అవార్డు ఎక్సైజ్ శాఖ కు వచ్చింది. గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా రవీంద్రభారతిలో గురువారం సాయంత్రం కమిషనర్ సి.హరికిరణ్ అవార్డును అందుకున్నారు.



## ఈ నెల 13-19 వరకు షాపింగ్ ఫెస్టివల్

- సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు
- ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

**విజయవాడ, అక్టోబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 13–19వ తేదీ వరకు విజయవాడలో షాపింగ్ ఫెస్టివల్ నిర్వహించనున్నామని.. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయ శాఖల అధికారులు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జేసీ ఇలక్కియ.. జాయింట్ కమిషనర్ (జీఎస్టీ) ఎస్.ప్రశాంత్ కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు చేకూరే ప్రయోజనాలపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. ఇందులో భాగంగా జీఎస్టీ తగ్గుదల ప్రభావమున్న వస్తువుల స్టాళ్లతో షాపింగ్ ఫెస్టివల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డీఆర్‌డీఏ, యూసీడీ ద్వారా కూడా కొన్ని స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సరైన వేదిక గుర్తింపు, స్టాళ్ల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాల కల్పన, సాంస్కృతిక కార్యక్రమాలు తదితరాలను ప్రణాళికాయుతంగా చేపట్టి కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని జేసీ ఇలక్కియ ఆదేశించారు. సమావేశంలో డీఈవో యూవీ సుబ్బారావు, జిల్లా పరిశ్రమల అధికారి పి.వెంకటరావు, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విపిఎస్‌లో గ్రాండ్ పేరెంట్స్‌కు చిత్రలేఖనం పోటీలు



**విజయవాడ, అక్టోబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

మొగల్రాజపురం లోని వీరమాచనేని సిద్ధార్థ పబ్లిక్ విపిఎస్ పబ్లిక్ స్కూల్లో గురువారం కిండర్గార్టెన్ విభాగం ఎల్ కే జి చిన్నారుల రెండు రోజుల గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలలో భాగంగా తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మలకు చిత్రలేఖనం, బెస్ట్ ఫ్రం ద వేస్ట్ క్రాఫ్ట్ పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎల్ కే జి చిన్నారుల తాతయ్యలు, బామ్మలు, చిన్నారులతో కలిసి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రోజ్ మేరీ, హెడ్ మిస్ట్రెస్ చల్లా జయలక్ష్మి హాజరైన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. విజేతలకు శుక్రవారం నిర్వహించే వేడుకలలో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందనీ, మరిన్ని ఉత్సాహభరితమైన కార్యక్రమాలు వారి కోసం ఏర్పాటు చేశామనీ తెలిపారు.

## ఈ నెల 23న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

**విజయవాడ, అక్టోబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

యువతలో కళా నైపుణ్యం, జాతీయభావం పెంపొందించడంలో భాగంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ కొత్తపేట కేబీఎన్ కళాశాలలో యువజనోత్సవాలు నిర్వహించనున్నామని.. 2025, సెప్టెంబర్ 1 నాటికి 15–29 ఏళ్ల వయసుకలిగిన, జిల్లాస్థానికత ఉన్న యువత పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వికసిత్ భారత్ జిల్లా స్థాయి – కల్చరల్ అండ్ ఇన్నొవేషన్ ట్రాక్ విభాగంలో ఫోక్ డ్యాన్స్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, పొయెట్రీ, డిక్లమేషన్, ఇన్నొవేషన్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు https://short-url.org/1gYpz లింక్ ద్వారా ఈ నెల 22లోపు పేర్లు నమోదు చేసుకోవాలని లేదా వేదిక వద్ద 23వ తేదీ ఉదయం పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయి విజేతలు, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. పూర్తి వివరాలకు 9949522694, 9032115987 నంబర్లలో కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చని యు.శ్రీనివాసరావు తెలిపారు.

## వైద్యులు లేక పలు ఇబ్బందులు పడుతున్న రోగులు

**ఆగిరిపల్లి, అక్టోబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**



ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు పడిగా పులు పడుతున్నారు. వైద్యులు కోసం రెండు గంటల నుండి ఎదురు చూస్తున్న రోగులు, పలు రకాల వైద్య సమస్య లతో వచ్చిన రోగులకు చికిత్స చేసేవారే కరవయ్యా రని బాధితులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు.దీనిపై అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

## సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం



**మైలవరం, అక్టోబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జి కొండూరు మైలవరం మండలాల పరిధిలోగల రైతు సేవ కేంద్రాల వద్ద గురువారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్ రైతులకు బ్రోమోడయోలిన్ మందును వందశాతం రాయితీతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందించారు. మందును తయారు చేసే విధానాన్ని రైతులకు స్వయంగా తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి ఏం ఎఫ్ విజయ కుమారి, డి డి ఏ శారద, ఏ డి ఏ అనిత, జి కొండూరు ఏవో కె సిహెచ్ సూరిబాబు , మైలవరం ఏ ఓ సంధ్యారాణి మరియు గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థుల విద్య ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి





- సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నాం
- పేద విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దండి
- హాస్టల్ నిర్వహణ, పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారు లను నియమిస్తున్నామని, విద్యార్థుల సంక్షేమ, విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివేలా సంక్షేమ అధికారులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ, గురుకుల వసతి గృహాల నిర్వహణపై జిల్లా సంక్షేమ అధికారులు, సహాయ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ గురువారం నగరంలోని రైతు శిక్షణ కేంద్రం సమావేశ మందిరం నందు సమీక్ష సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 సాంఘిక సంక్షేమ వసతి గృహలు, 26 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహలు, 3 గిరిజన సంక్షేమ వసతి గృహాలు, 2 మైనార్టీ సంక్షేమ వసతి గృహల పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. వసతి గృహ విద్యార్థుల భవిష్యత్ సంక్షేమ అధికారులపై ఉందన్నారు. చిన్నతనంలో తాను కూడా హాస్టల్‌లో ఉంటూ విద్యను అభ్యసించి ఈ స్థాయికి ఎదిగిన వాడినేనన్నారు.. సంక్షేమ వసతి గృహ నిర్వహణ విద్యార్థుల ఇబ్బందులు స్వయంగా తెలిసిన వాడినన్నారు... తాను ఉన్న హాస్టల్ సంక్షేమ అధికారి విద్యార్థుల భవిష్యత్‌పట్ల అత్యంత శ్రద్ద కనపరిచేవారని విద్యతో పాటు ఆరోగ్యం క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని ఎప్పటికి తన మనసులో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. సంక్షేమ వసతి గృహ అధికారులు గురుతర భాధ్యతను గుర్తెరిగి మరింత భాధ్యతాయుతమైన సేవలందిస్తూ ఆశించిన ఫలి తాలు సాధించాలన్నారు. ప్రభుత్వానికి పిల్లల విద్య ఆరోగ్యమే ముఖ్యమని ప్రత్యేక అధికారులు వారానికి ఒక రోజు హాస్టల్స్‌ను సందర్శించి నిర్వహణలో లోపా లను గుర్తిస్తే సరిచేసేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ద పెట్టాలని, కాచి చలార్చిన నీటిని వినియోగి ంచాల న్నారు. హస్టల్స్‌కు సరఫరా చేసే మినరల్ వాటర్ ప్లాంట్లను వాటర్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల న్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు హస్టల్ నందు ఆహారాన్ని తనిఖీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక అధికారులు వసతి గృహ సంక్షేమ అధికారులు విద్యార్థుల తల్లిద ండ్రులతో సమావేశాలను నిర్వహించాలన్నారు. విద్యా ర్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రతి విద్యార్థికి కేర్ షీట్‌ను నిర్వహించాలన్నారు. వసతి గృహ నిర్వహణలో పచ్చదనం, పరిశుభ్రత, పారిశుధ్యానికి అత్యంత ప్రాదాన్యతనిచ్చి నిర్వహించినప్పుడు విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంతో పాటు మెరుగైన విద్యను అభ్యసించేందుకు ఎంతో దోహదపడుతుం దన్నారు. విద్యార్థులకు వసతి గృహాలలో కిచెన్ షెడ్ల నిర్వహణను నిశితంగా పరిశీలిం చాలని ప్రతి వసతి గృహంలోను ఎటిఎం కిచెన్ గార్డెన్‌ను నిర్వహిం చాలన్నారు. విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు ద్వారా మొక్క లు నాటి సంరక్షించే భాద్యతను అప్పగిం చాలన్నారు. వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని.. ఆలసత్వం వహిస్తే సహించ బోనన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి హాస్టల్స్ నిర్వహణలో మంచి ఫలితాలను సాధించే అధికారులను మనస్ఫూ ర్తిగా అభినందిస్తానని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవె న్యూ అధికారి ఎం లక్ష్మీనరసింహాం, జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ అధికారి ఎం. రమదేవి, మైనార్టి సంక్షేమ అధిక ారి అబ్దుల్ రబ్బాని, గురుకుల విద్యాలయ సంక్షేమ అధికారి ఏ.మురళికృష్ణ, వెనక బడిన సంక్షేమ అధికారి కె. లక్ష్మీదేవి, సహాయ సంక్షేమ అధికారులు వి. గణేష్, టి. గాయత్రి, ఎం.ఇ బ్రాయిల్ వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

# దసరా మహొత్సవాలలో రెడ్ క్రాస్ సేవలు ప్రశంసనీయం





- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ
- రెడ్ క్రాస్ వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేసిన కలెక్టర్

**విజయవాడ, అక్టోబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

దసరా మహొత్సవాలలో రెడ్ క్రాస్ సంస్థ అందించిన సేవలు ప్రశంసనీయమైనవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ & ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. స్థానిక కలెక్టోరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన రెడ్ క్రాస్ వాలంటీర్ల అభినందన సభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ.... దసరా మహొత్సవాలలో వృద్ధులకు, దివ్యాంగులకు రెడ్ క్రాస్ వాలంటీర్లు మంచి సేవలు అందించారని చెప్పారు. ఉత్సవాలు 11 రోజులపాటు జరిగినా, లక్షలాది భక్తులు హాజరైనా రెడ్ క్రాస్ వాలంటీర్లు అలుపెరగకుండా రాత్రిం బవళ్లు పనిచేశారని చెప్పారు. ఉత్సవాలు విజయవంతంగా ముగియడంలో రెడ్ క్రాస్ పాత్ర కూడా ఉందన్నారు. ఇదే సేవాభావంతో భవిష్యత్తులో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని సూచించారు. ఉత్తమ సేవలు అందించిన రెడ్ క్రాస్ వాలంటీర్లకు జిల్లా కలెక్టర్ అభినందన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్యులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. సమరం మాట్లాడుతూలి... జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మార్గదర్శకత్వంలో అద్భుతంగా సేవలం దించగలిగామని చెప్పారు. ఒక షిఫ్ట్ కు 20 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో రోజుకు 60 మంది విద్యార్థులు అమ్మవారి భక్తులకు సేవలందించారని చెప్పారు. కేబీఎన్, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ ఫార్మసీ కళాశాలల యూత్ రెడ్ క్రాస్ విభాగాల విద్యార్థులు ఈ ఉత్సవాలలో పాల్గొన్నట్టు తెలిపారు. దసరా ఉత్సవాలే కాక రక్తదానం, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లో కూడా రెడ్ క్రాస్ బృం దాలు పాల్గొంటున్నాయని తెలిపారు.రెడ్ క్రాస్ ఎన్టీఆర్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి మాట్లా డుతూ.. నదిలో, కాలువలలో ఉన్న వ్యర్థాల తొలగింపు కోసం" వందే కృష్ణం" అనే కార్యక్రమాన్ని త్వరలో చేపట్టను న్నట్టు చెప్పారు. వరద సమయంలో సేవలందించా మని, పి4 కార్యక్రమంలో కూడా భాగస్వాములు అవుతు న్నామని చెప్పారు. దాదాపు 270 మందికి కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు, ఎలక్ట్రిక్ ఆటోలను అందిస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఇ.చిట్టిబాబు, కేబీఎన్ కళాశాల, పొట్టి శ్రీరాములు ఇంజనీ రింగ్ కళాశాలల రెడ్ క్రాస్ యూత్ వింగ్ వాలంటీర్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

# బాణసంచా నిల్వలు, అమ్మకాలపై గట్టి నిఘా పెట్టండి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- లైసెన్స్ రద్దు, షాప్ సీజ్ చేసి కేసుల నమోదు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**



బాణసంచా అక్రమ నిల్వలు, అమ్మకాలపై అధికారులు నిరంతరం నిఘా నిర్వహించాలని నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిల్వలు, అమ్మకాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా .జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ నెల 21 నా దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచ నిల్వలు, అమ్మకాల పర్యవేక్షణక పై గ ం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుండి రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ, మున్సిపల్, వైద్య ఆరోగ్యం, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21 వ తేదీన దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు బాణసంచాను కొనుగోలు చేస్తారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని బాణసంచా అమ్మకం దారులు పెద్దయెత్తున అక్రమ నిల్వలు చేసే అవకాశం ఉంటుందన్నారు. బాణసంచా అక్రమ నిల్వలు అమ్మకాలు రవాణా పై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర తనిఖీలు అనంతరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాత్కాలిక బాణసంచ విక్రయ దుకాణాలకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, అగ్నిమాపక, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ బృందాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అవసరమైన మైదానాలను సిద్ధం చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారుల నివేదికలకు అనుగుణంగా ప్రాంతాలను గుర్తించాలన్నారు. బాణసంచ విక్రయించేందుకు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందుగానే దుకాణదారులు తప్పనిసరిగా ల్కైసెన్సు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా బాణసంచను నిల్వ ఉంచి, అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గతం లో జింఖానా మైదానంలో బాణసంచ విక్రయాలు నిర్వహించిన ప్రాంగణంలో భద్రతాపరమైన లోపాల వల్ల అగ్నిప్రమాదం సంభవించి, ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందుగానే పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు రెవెన్యూ అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు.బాణసంచ విక్రయ కేంద్రాల వద్ద ఫైర్ ఇంజన్లను ఏర్పాటు చేయడంతో పాటు అగ్రిమాపక పరికరాలను ఏర్పాటు చేయాలని అగ్ని మాపక అధికారులకు కలెక్టర్ సూచించారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి సంఘటనలకు తావులేకుండా ముందుగానే విద్యుత్ అధికారులు తనిఖీలను నిర్వహించాలన్నారు. ఏకసభ్య విచారణ కమిటీ చేసిన 23 సిఫార్సులను కచ్చితంగా పాటించేలా చూడాలని ఆదేశించారు. దుకాణానికి దుకాణానికి మధ్య 3 మీ. దూరం ఉండేవిధంగా చూడటంతో పాటు దుకాణాలు ఎదురెదురుగా ఉండకుండా చూడాలన్నారు. రెసిడెన్షియల్ ఏరియాకు కనీసం 50 మీ. దూరంలో మాత్రమే దుకాణాలకు అనుమతివ్వాలని స్పష్టం చేశారు. ఒక క్లస్టర్‌లో 50కి మించి దుకాణాలకు అనుమతివ్వకూడదన్నారు. జన సంచారం లేని సమయంలో మాత్రమే బాణసంచా ఎగుమతులు దిగుమతులు జరిగేలా చూడాలన్నారు. అనుమతులకు మించి దుకాణం వద్ద అధిక స్టాక్ ఉంచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం ,డి ఆర్ ఓ ఎం లక్ష్మి నరసింహం, డీసీపీ కేజీవీ సరిత, అగ్నిమాపక అధికారి శంకర్‌రావు, వీఎంసీ అగ్నిమాపక అధికారి నరేష్, ఆర్‌డీవో లు కె.చైతన్య,కె.మాదురి బాలకృష్ణ ల్ డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వస్తుందో.. రాదో!

## నోబెల్ 'శాంతి' పై ట్రంప్ నిర్వేదం




**వాషింగ్టన్, అక్టోబరు 10:** ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి ప్రకటనకు ఒక్క రోజు ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఏడు ప్రపంచ స్థాయి వివాదాలను పరిష్కరించానని చెప్పుకుంటూనే, ఆ పురస్కారం తనకు దక్కకపోవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తనకు బహుమతి ఇవ్వకుండా ఉండేందుకు నార్వే నోబెల్ కమిటీ ఏదో ఒక కారణాన్ని వెతుకుతుందని ఆయన జోస్యం చెప్పారు. గురువారం వైట్ హౌస్‌లో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. నాకు నోబెల్ బహుమతి వస్తుందో లేదో తెలియదు. మేం ఏడు యుద్ధాలను పరిష్కరించామని విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెబుతారు. ఎనిమిదో వివాదం పరిష్కారానికి కూడా చాలా దగ్గరగా ఉన్నాం. రష్యా సమస్యను కూడా మేమే పరిష్కరిస్తామని భావిస్తున్నాను. చరిత్రలో ఏ నాయకుడూ ఇన్ని వివాదాలను పరిష్కరించి ఉండడు అని ట్రంప్ అన్నారు. అయితే, నోబెల్ కమిటీ మాత్రం తనకు పురస్కారం ఇవ్వకపోవడానికి ఏదో ఒక కారణం వెతుకుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ట్రంప్ ఇలా అనుమానాలు వ్యక్తం చేస్తుండగా, వైట్ హౌస్ మాత్రం ఆయన్ను ది పీస్ ప్రెసిడెంట్ (శాంతి అధ్యక్షుడు) అంటూ అభివర్ణిస్తూ ఒక చిత్రాన్ని పంచుకుంది. ఇది ట్రంప్ వ్యాఖ్యలకు పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. ఇటీవల ఇజ్రాయెల్‌హమాస్ మధ్య తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించినట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గతంలో భారత్‌పాకిస్థాన్ మధ్య నెలకొన్న సైనిక సంక్షోభాన్ని కూడా తానే పరిష్కరించానని ట్రంప్ పలుమార్లు చెప్పుకున్నారు. ఈ కారణంగానే పాకిస్తాన్ ఆయన పేరును నోబెల్ శాంతి బహుమతికి సిఫార్సు చేసింది. అయితే, అమెరికా జోక్యం వల్లే కాల్పుల విరమణ జరిగిందన్న వాదనను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ డీజీఎంఓ అభ్యర్థన మేరకే కాల్పుల విరమణకు అంగీకరించామని, ఇందులో అమెరికా పాత్ర ఏమీ లేదని న్యూఢిల్లీ స్పష్టం చేసింది. తనకంటే ముందు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి రావడంపై పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్, ఈసారైనా తనకు ఆ పురస్కారం దక్కాలని బలంగా ఆకాంక్షిస్తున్నారు.

# ఇక 'జైషే' మహిళా ఉగ్రవాదులు!

## పంథాను మార్చుకున్న అంతర్జాతీయ ఉగ్రసంస్థ



**ముజఫరాబాద్, అక్టోబరు 10:** ఆపరేషన్ సిందూర్ దెబ్బకు ఛిన్నాభిన్నమైన పాక్ ఉగ్ర సంస్థ జైషేమహ్మద్ కొత్త పన్నాగానికి తెర తీసింది. ఉగ్రకార్యకలాపాల్లో తొలిసారిగా మహిళలను రంగంలోకి దింపేందుకు సిద్ధమైంది. ఐసిస్, బోకో హరామ్, హమాస్, ఎల్‌టీటీఈ వంటి సంస్థలు మహిళా ఉగ్రవాదులను ఆత్మాహుతి దాడులకు ఉపయోగిస్తాయి. అయితే, లష్కర్ ఏ తాయిబాతో పాటు జైష్ మాత్రం మహిళలను యుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉంచుతాయి. కానీ జైష్ తాజాగా తన పంథాను మార్చుకుంది. ఉగ్ర కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు మహిళలనూ రంగంలోకి దించేందుకు సిద్ధమైంది. ఇందుకు జైష్ అధినేత మసూద్ అజర్, అతడి సోదరు తల్హా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మహిళ ఉగ్రమూకల బృందానికి జమాత్ ఉల్ మోమినత్ పేరును ఖరారు చేశారు. ఈ దళానికి జైష్ అధినేత మసూద్ అజర్ సోదరి సాదియా అజర్ నేతృత్వం వహిస్తోంది. ఈ బృందంలో ఇప్పటికే జైషే ఉగ్రవాదుల భార్యలను చేర్చుకుంది. వీరితో ఆత్మాహుతి దాడులు చేయించేందుకు తర్ఫీదునిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత దళాలు జైష్ ప్రధాన కార్యాలయంపై జరిపిన దాడిలో సాదియా భర్త మరణించాడు. ఆర్థికంగా, సామాజికంగా బలహీన స్థితిలో ఉన్న మహిళలను జైష్ ఈ బృందంలో చేర్చుకుంటోంది. బహావల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్, మాన్సేరా ప్రాంతాల్లోని తన కేంద్రాల్లో మహిళలను రిక్రూట్ చేసుకుంటోంది. వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా రిక్రూట్‌మెంట్ చేసుకునేందుకు ట్రై చేస్తోంది. భారత్‌లో కూడా జమాత్ ఉల్ మోమినత్ కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమైన జైష్ ఆన్‌లైన్ వేదికల ద్వారా జమ్మూకశ్మీర్, యూపీలో తన ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. దక్షిణాదిలోని కొన్ని ప్రాంతాలను కూడా జైష్ టార్గెట్ చేసింది. మతం పేరిట నగరాల్లోని విద్యావంతులైన మహిళను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించేలా మక్కా, మదీనాల ఫొటోలతో కూడిన సర్క్యులర్‌లను జారీ చేసింది. ఇక ఆపరేషన్ సిందూర్ దాడుల్లో తమ కుటుంబంలోని పది మంది మరణించారని జైష్ అధిపతి మసూద్ గతంలో ప్రకటించాడు. తన సోదరి, ఆమె భర్త, మరో బంధువు, అతడి భార్య, మేనకోడలు, మరో ఐదుగురు చిన్నారులు మరణించినట్టు తెలిపారు. భారత్ 1994లో మసూద్‌ను అరెస్టు చేసినా ఆ తరువాత ఎయిర్ ఇండియా ఐసీ 814 విమానం హైజాక్ నేపథ్యంలో అతడిని విడిచిపెట్టాల్సి వచ్చింది.



# చైనాలో 5.4 తీవ్రతతో భూకంపం

## భూటాన్‌లోనూ ప్రకంపనలు

**బీజింగ్, అక్టోబరు 10:** చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో గురువారం తీవ్ర భూకంపం సంభవించింది. అయితే 5.4 తీవ్రతతో సంభవించిన భూకంపం ప్రాంతం పశ్చిమంలోని ఎత్తయిన ప్రాంతాల్లో ఒకటైన గాంజీ అని చైనా భూకంప నెట్‌వర్క్స్ కేంద్రం తెలిపింది. ఈ భూకంపం దాటికి పొరుగున ఉన్న భూటాన్‌లోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. భూకంప కేంద్రం గాంజీ ప్రాంతంలో పది కిలోమీటర్ల అడుగు ఉందని తెలిపింది. గాంజీ ప్రాంతంలో జనసాంద్రత తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ ఈ భూకంపం ధాటికి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రాంతానికి దక్షిణ సరిహద్దులో యున్నాన్, పశ్చిమాన టిబెట్ ఉంది. ఎత్తయిన పర్వతాలతో నిండి కఠిన పరిస్థితులుండే గాంజీ ప్రాంతమంటే పర్వతారోహకులకు, ప్రకృతి అన్వేషకులకు చాలా పరిచయమే. అయితే గత ఐదేళ్ల కాలంలో చైనాలో సంభవించిన భూకంపాల తీవ్రతల్లో గురువారం నాటి భూకంపం తీవ్రత ఎక్కువని చైనా భూకంప నెట్‌వర్క్స్ కేంద్రం వివరించింది.

# చెప్ప విసిరిన లాయర్‌కు సుప్రీంకోర్టులో నోఎంట్రీ!

## కోర్టు బార్ అసోసియేషన్ నిర్ణయం



**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** సుప్రీంకోరు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై ఓ న్యాయ వాది చెప్పుతో దాడి చేసేందుకు యత్నించిన ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనను పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇక సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ని సస్పెండ్ చేస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో న్యాయవాది రాకేష్ కిశోర్‌కు సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ షాక్ ఇచ్చింది. రాకేష్ సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటూ సుప్రీంకోర్టు పాంగణం లోకి ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. సీజేఐపై న్యాయవాది రాకేష్ కిశోర్ చేసిన దాడి స్వతంత్ర న్యాయవ్యవస్థపై పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. ఈనెల 6వ తేదీన ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా సీజేఐ జస్టిస్ గవాయ్‌పై ఓ న్యాయవాది బూట్ విసిరేందుకు ప్రయత్నించాడు. లాయర్లు కేసుల గురించి ప్రస్తావిస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. న్యాయవాది రాకేష్ కిశోర్ వేదిక వద్దకు వెళ్లి తన బూట్‌ను తీసి సీజేఐపైకి విసిరేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి అతడిని అడ్డుకొని అక్కడి నుంచి తరలించారు. ఈ సమయంలో అతడు 'సనాతన ధర్మానికి అవమానాన్ని సహించం' అని గట్టిగా అరిచారు. అయితే దీనిపై సీజేఐ గవాయ్ చలించకుండా వాదనలు కొనసాగించాలని న్యాయవాదులను కోరారు. 'ఇలాంటి వాటితో కలవరపడకండి. మేం కలవరపడలేదు. ఇలాంటివి నన్ను ప్రభావితం చేయవు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై కోర్ట్ భద్రతా యూనిట్ విచారణ ప్రారంభించింది.

# కౌంటర్ డ్రోన్ వ్యవస్థ 'సాక్షమ్' ఇక రంగంలోకి

## ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో రూపకల్పన



**న్యూఢిల్లీ, అక్టోబర్10:** సరిహద్దుల్లో శత్రు దేశాల నుంచి డ్రోన్ల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యం మరింత ముందడుగు వేసింది. సంపూర్ణ దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'సాక్షమ్' అనే అత్యాధునిక కౌంటర్ డ్రోన్ వ్యవస్థను కొనుగోలు చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో ఘజియాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) ఈ వ్యవస్థను రూపొందించింది. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన దాదాపు 400 డ్రోన్లను భారత భద్రతా దళాలు విజయవంతంగా నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత, డ్రోన్లను ఎదుర్కోవడానికి ఒక పటిష్టమైన వ్యవస్థ అవసరాన్ని సైన్యం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే సాక్షమ్ కొనుగోలుకు ఫాస్ట్ ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ (ఎఫ్టీపీ) విధానంలో ఆమోదం తెలిపింది. రాబోయే ఏడాదిలోగా ఈ వ్యవస్థను అన్ని సైనిక క్షేత్రాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో సైన్యం కేవలం భూభాగంపైనే దృష్టి సారించేది. కానీ ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా, భూమికి 10,000 అడుగుల ఎత్తు వరకు ఉన్న గగనతలాన్ని కూడా వ్యూహాత్మక యుద్ధ క్షేత్రంగా పరిగణిస్తున్నారు. ఈ ప్రాంతంలో శత్రు డ్రోన్లు, విమానాలను గుర్తించి, వాటిని నాశనం చేస్తూనే మన వైమానిక దళాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడటమే సాక్షమ్ ప్రధాన లక్ష్యమని రక్షణ శాఖ అధికారులు వివరించారు. సాక్షమ్ వ్యవస్థ ఒక మాడ్యులర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌గా పనిచేస్తుంది. ఇది శత్రు డ్రోన్లను సరైన సమయంలో గుర్తించడం, ట్రాక్ చేయడం, వాటిని నిర్వీర్యం చేయడం వంటి పనులను చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ, ముప్పును ముందుగానే పసిగట్టి కమాండర్లకు వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు సహకరిస్తుంది. సెన్సార్లు, సాఫ్ట్‌కిల్, హార్డ్‌కిల్ ఆయుధ వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తెచ్చి, గగనతలంలో పూర్తి స్థాయి భద్రతను అందిస్తుంది. రష్యాఉక్రెయిన్, ఇజ్రాయెల్ పాలస్తీనా వంటి ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల పాత్ర పెరిగిన తరుణంలో, భారత సైన్యం ఈ వ్యవస్థను సమకూర్చుకోవడం వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# భారత్ అభివృద్ధిపై యుకె పిఎం కీర్ స్టార్మర్ ప్రశంసలు

## డొనాల్డ్ ట్రంప్ డెడ్ ఎకానమీ వ్యాఖ్యలకు కౌంటర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** 'భారత్‌ది డెడ్ ఎకానమీ..' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న అక్కసుతోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ డెడ్ ఎకానమీ వ్యాఖ్యలకు యుకె ప్రధాని కీర్ స్టార్మర్ కౌంటర్ ఇచ్చారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న యుకె ప్రధాని.. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలను ప్రశంసించారు. భారత్ ఇటీవలే జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గుర్తు చేశారు. 2028 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పయనిస్తోందంటూ ప్రశంసలు కురిపించారు. యుకె ప్రధాని కీర్ స్టార్మర్ భారత్ పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. '2028 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు గానూ ప్రధాని మోడీ నాయకత్వానికి అభినందనలు. ఇక్కడికొచ్చి ఈ పరిస్థితులు చూస్తుంటే మీరు లక్ష్యాన్ని చేరుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# కోల్డ్రిఫ్ కంపెనీ యజమాని చెన్నైలో అరెస్టు



**చెన్నై,అక్టోబరు 10:** దగ్గు మందు అంటే భయపడేలా చేసిన కోల్డ్రిఫ్ కాఫ్ సిరప్‌ను తయారు చేస్తున్న కంపెనీ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని చెన్నైలో శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్ ఓనర్ రంగనాథన్‌ను మధ్యప్రదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సిరప్ కారణంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఇప్పటివరకు 20 మంది చిన్నారులు మరణించారు. చిన్నారుల మరణాలు, అస్వస్థత నేపథ్యంలో కాంచీపూరంలో ఉన్న శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్‌లో ఈనెల 1, 2 తేదీల్లో మధ్యప్రదేశ్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ యూనిట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోల్డ్రిఫ్ సిరప్ తయారీ యూనిట్‌లో గ్యాస్ స్టవ్‌లపైనే రసాయనాలను వేడిచేయడం, తుప్పు పట్టిన పరికరాలు, మురికి పట్టిన పైపులు, గ్లౌజులు, మాస్కులు లేకుండా సిబ్బంది పదార్థాలను మిక్స్ చేయడం వంటివి అధికారులు గమనించారు. అక్కడున్న కార్మికుల్లో దాదాపుగా అనుభవం లేనివారేనని, స్వచ్ఛత పరీక్షలు జరుపకుండానే సిరప్‌ల కోసం నీటిని ఉపయోగిస్తున్నారని తేలింది. ఎయిర్ ఫిల్టర్లు, హెచ్ఈపీఏ వ్యవస్థలు లేకపోవడం వంటివి గుర్తించారు.

# నాభర్త మృతి కారకులపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలి

## ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనికి ఐపిఎస్ భార్య లేఖ



**హర్యానా, అక్టోబర్ 10:** తన భర్త మృతికి బాధ్యులైన వారిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయ్యాలని ప్రభుత్వాన్ని ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్ భార్య అమినిత్ పి కుమార్ డిమాండ్ చేశారు. ఆ క్రమంలో హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ కుమార్ సింగ్ సైనీకి ఆమె గురువారం లేఖ రాశారు. సదరు ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు వేయాలంటూ ఆ లేఖలో సీఎం సైనీకి ఆమె విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఈ కేసు దర్యాప్తులో వారు జోక్యం చేసుకుంటారని సందేహం వ్యక్తం చేశారు. అలాగే సాక్ష్యాధారాలను వారు తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. అదే విధంగా ఈ కేసు దర్యాప్తుపై వీరు ప్రభావితం చేస్తారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. వారి నుంచి తమ కుటుంబానికి ముప్పు పొంచి ఉందని ఆందోళన చెందారు. వారి నుంచి తమకు బెదిరింపులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆ లేఖలో ఆమె స్పష్టం చేశారు. తన కుటుంబానికి రక్షణ కల్పించాలని సీఎం సైనీని ఆమె కోరారు. తన భర్త మరణించి రోజులు గడుస్తున్నా.. నేటికి ఆయనను వేధించి, అవమానించి, మానసిక హింసకు గురి చేసిన వారిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని విచారం వ్యక్తం చేశారు. అదీకాక తన భర్త మృతికి కారకులైన అధికారులంతా ఉన్నత స్థానాల్లో ఉన్నారని ఈ సందర్భంగా ఆమె ఆ లేఖలో వివరించారు. ఈ ఉన్నత స్థాయి శక్తివంతమైన ఈ అధికారులు తనతోపాటు తన కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్రమంలో శాఖ పరంగా లేకుంటే ఇతరత్రా తనను ఇరికించే ప్రయత్నాలు చేయవచ్చని ఈ సందర్భంగా ఆమె భయాందోళన చెందారు. తన భర్త ఆత్మహత్య గురించి తెలిసిన వెంటనేతన కుమార్తెను భర్త ఉన్న ప్రదేశానికి పంపానని ఆ లేఖలో చెప్పారు. ఆ సమయానికి తన భర్త ఇంటి బేస్‌మెంట్‌లో విగత జీవిగా పడి ఉన్నారని తన కుమార్తె వివరించిందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి వై పూరన్ కుమార్ హర్యానా కేడర్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య అమినిత్ పి కుమార్ సైతం అదే రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా పని చేస్తున్నారు. అయితే పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో.. అమినిత్ పి కుమార్ జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ బృందం జపాన్‌లో పర్యటిస్తుంది. ఆ బృందంలో ఆమె సైతం ఉన్నారు. హర్యానా పోలీస్ శాఖలో పూరన్ వై కుమార్ తీవ్ర కుల వివక్షకు గురైనట్లు తెలుస్తోంది. ఆ క్రమంలో బుధవారం తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుచుకుని ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. పూరన్ వై కుమార్ హర్యానాలో అడిషనల్ డీజీపీగా విధులు నిర్వహిస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## విజయ్ ఇంటికి మరోసారి బాంబు బెదరింపు



**చెన్నై, అక్టోబరు 10:** ప్రముఖ తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్ ఇంటికి బాంబు బెదిరింపు రావడం చెన్నైలో తీవ్ర కలకలం సృష్టించింది. భవిష్యత్తులో బహిరంగ సభలు నిర్వహిస్తే ఆయన ఇంటికి బాంబు పెడతామని ఓ ఆగంతుకుడు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి హెచ్చరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నీలాంగరైలోని విజయ్ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం కన్యాకుమారి నుంచి ఓ వ్యక్తి అత్యవసర నంబర్ 100కు ఫోన్ చేసి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. కరూర్‌లో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించిన నేపథ్యంలో ఈ బెదిరింపు.

## రేసింగ్‌లో ప్రమాదం: నుజ్జునుజ్జయిన పోర్షేకారు



**ముంబయి, అక్టోబరు 10:** ముంబై మహానగరంలో లగ్జరీ కార్ల రేసింగ్ బీభత్సం సృష్టించింది. అత్యంత వేగంతో దూసుకెళ్లిన ఓ పోర్షే కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నగరంలోని వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేపై జోగేశ్వరి మెట్రో స్టేషన్ సమీపంలో గత అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పోర్షే కారు, మరో బీఎండబ్ల్యూ కారు హైవేపై రేసింగ్‌కు దిగినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. గంటకు సుమారు 150 కిలోమీటర్ల వేగంతో ఈ రెండు కార్లు పోటీ పడుతుండగా, ఉన్నట్టుండి పోర్షే కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు నేరుగా వెళ్లి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆ లగ్జరీ కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. రెండు కార్లు ఒకదానితో ఒకటి పోటీ పడుతూ వేగంగా వెళ్లాయి.

## అఫ్ఘాన్ విదేశాంగ మంత్రికి ఘనస్వాగతం

**న్యూఢిల్లీ, అక్టోబరు10:** ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తఖీ అధికారిక పర్యటన కోసం గురువారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాలు, పలు ప్రాంతీయ అంశాలపై చర్చించేందుకు ఆయన వారం రోజుల పాటు భారతదేశంలో పర్యటించనున్నారు. ఢిల్లీకి చేరుకున్న ముత్తఖీకి భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వాగతం పలికింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు, ప్రాంతీయ సమస్యలపై జరగనున్న చర్చల కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొంది. ఈ పర్యటనలో భాగంగా ఆమిర్ ఖాన్ ముత్తఖీ భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. వాస్తవానికి ఈ పర్యటన కొన్ని వారాల క్రితమే జరగాల్సి ఉన్నప్పటికీ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) విధించిన ప్రయాణ నిషేధం నుంచి మినహాయింపు లభించకపోవడంతో వాయిదా పడింది.

## మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు: కర్ణాటక కేబినెట్ నిర్ణయం

**బెంగళూరు, అక్టోబర్10:** మహిళా ఉద్యోగుల విషయంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెలకు ఒకరోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగినులతో పాటు వస్త్రపరిశ్రమ, బహుళజాతి సంస్థలు, ఐటి కంపెనీలు, ఇతర ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేసే వారికి ఈ సెలవు వర్తించనుందని ప్రభుత్వం వెల్లడించింది. శ్రామిక మహిళల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం. నెలసరి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు మానసిక, శారీరక సౌకర్యం అందించాలన్నదే మా ఉద్దేశం. ఈ నిర్ణయం ఉద్యోగినులకు ఎంతగానో ఉపకరించనుంది. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేస్తున్నాయి. అందుకే ఇక్కడా ఆ సెలవును ఇవ్వాలనుకున్నాం అని న్యాయశాఖ మంత్రి హెచ్ కె పాటిల్ వెల్లడించారు.

## 51 మందితో పికె తొలి జాబితా



**పాట్నా, అక్టోబరు10:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో జన్ సురాజ్ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. 51 మంది అభ్యర్థులతో పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ గురువారంనాడు తొలి జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో వైద్యులు, మాజీ పోలీస్ అధికారులు, విద్యావేత్తల పేర్లున్నాయి. 1989లో భాగల్పూర్ అల్లర్లను నియంత్రించడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించిన మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌కె మిశ్రా 'దర్భంగా' నుంచి పోటీ చేయనున్నారు. ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు కెసి సిన్హా 'కుమ్రార్' నుంచి. వీరితోపాటు వైద్య నిపుణుడు డాక్టర్ అమిత్ కుమార్ దాస్, పాట్నా హైకోర్టు సీనియర్ న్యాయవాది వైబి గిరి, మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ మనవరాలు జాగృతి ఠాకూర్, మాజీ ఐపీఎస్ అధికారి జైప్రకాష్ సింగ్, సామాజిక కార్యకర్త ప్రీతి కిన్నార్ పోటీచేయనున్నారు.

# అజర్‌బైజాన్ విమానంపై రష్యా క్షిపణుల మిస్‌ఫైర్

## ఉక్రెయిన్‌డ్రోన్లను మట్టుబెట్టే క్రమంలో ప్రమాదం

**మాస్కో అక్టోబరు10** అజర్‌బైజాన్ విమానం కూల్చివేతలో రష్యా ప్రమేయం అనుకోకుండా జరిగిందని, అయితే తాము నేరుగా దాడులకు దిగలేదని, ఉక్రెయిన్‌కు చెందిన డ్రోన్లను మట్టుబెట్టే క్రమంలో తాము ప్రయోగించిన క్షిపణి శకలాలు తగలడం వల్లనే అజర్‌బైజాన్ విమాన ప్రమాదం జరిగిందని మాస్కో అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ పేర్కొన్నారు అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం 8243కు క్షిపణి శకలాలు తలడంతో కూలిందని, ఉక్రెయిన్ మూడు డ్రోన్లు తమ సరిహద్దును దాటి రావడంతో వాటిని ట్రాక్‌చేసే క్రమంలో ఈ విమానం ప్రమాదానికి లోనయిందని పుతిన్ అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హాం హైదర్ ఓగ్లు అలియేవ్‌కు స్పష్టంచేసారు. సాంకేతిక లోపం తలెత్తడంతో ఉక్రెయిన్‌డ్రోన్‌పైచేసిన ప్రయోగం మిస్‌ఫైర్ అయిందన్నారు. రెండు క్షిపణులు ఈ ప్యాసింజర్ విమానానికి 33 అడుగుల దూరంలోనే పేలాయి. ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత తీసుకుని సంపూర్ణపరిహారం చెల్లిస్తామని రష్యా ప్రకటించింది.

# శాంతి ప్రణాళికపై ఇజ్రాయెల్-హమాస్ సంతకాలు

## నెతన్యాహు బలమైన నాయకత్వానికి ప్రతిబింబం: మోడీ పోస్ట్



**జెరూసలేం, అక్టోబరు 10:** గత రెండేళ్లుగా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ముగింపునకు కీలక ముందడుగు పడింది. గాజాలో యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. శాంతి ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ శాంతి ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. హమాస్ చేతిలో బందీగా ఉన్నవారంతా త్వరలోనే విడుదల అవుతారని ఈ సందర్భంగా ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుందని ట్రంప్ ప్రకటించారు. ఈ చరిత్రాత్మక, అపూర్వ సంఘటన జరగడానికి యుఎస్‌తోపాటు కలిసి పనిచేసిన మధ్యవర్తులు ఖతార్, ఈజిప్ట్, తుర్కియేకు ట్రంప్ ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు శాంతి ఒప్పందాన్ని హమాస్ సైతం ధ్రువీకరించింది. గాజాలో యుద్ధానికి ముగింపు పలికేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంది. గాజాలో యుద్ధం ముగింపునకు డొనాల్డ్ ట్రంప్ 20 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ఫార్ములాను భారత్ సహా పలు దేశాలు స్వాగతించాయి. ట్రంప్ ఫార్ములాకు ఇజ్రాయెల్, హమాస్ కూడా అంగీకారం తెలిపాయి. తాజాగా ఆ దిశగా తొలి అడుగు పడింది. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బలమైన నాయకత్వాన్ని ప్రశంసిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ ఒప్పందం యుద్ధంతో దెబ్బతిన్న గాజా ప్రాంతంలో శాశ్వత శాంతికి మార్గం సుగమం చేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ప్రణాళికలోని మొదటి దవ ఒప్పందాన్ని మేము స్వాగతిస్తున్నాం.

## విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



**నరసరావుపేట (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లాలో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో మాచెర్ల పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్ విభాగ పర్యవేక్షక ఇంజనీర్ డాక్టర్ పి. విజయకుమార్ సమన్వయంలో నలభై ఐదు మంది అధికారులు, నూటముప్పై ఐదు మంది సిబ్బంది నలభై ఐదు బృందాలుగా ఏర్పడి మొత్తం నాలుగు వేల మూడు వందల పదకొండు సర్వీసులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో విద్యుత్ చౌర్యం మరియు అక్రమ వినియోగం జరిగినట్లు గుర్తించి మొత్తం మూడు లక్షల ఎనభై తొమ్మిది వేల రూపాయల జరిమానా విధించారు.

వినియోగదారులు తమ ప్రాంగణంలో ఉన్న మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా చూసుకోవాలని అధికారులు సూచించారు. సీలు లేకపోయినా లేదా తుప్పు పట్టి ఊడిపోతే వెంటనే సంబంధిత అధికారి కి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం మీటరు లేకుండా, లేదా పనిచేయని మీటరు నుంచీ విద్యుత్ వినియోగించడం విద్యుత్ చౌర్యంగా పరిగణించబడుతుందని, చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. మొదటి తప్పిదానికి కాపౌండింగ్ పద్ధతిలో జరిమానా చెల్లిస్తే కేసు నుండి విడిపిస్తారు. రెండవసారి మాత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపిస్తారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని అధికారులు తెలిపారు. చౌర్యం జరిగిందని అనుమానిస్తే 9440812263, 8639741050 నంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. ఈ తనిఖీల్లో డీఈఈ ఏ. రామయ్య, విజిలెన్స్ డీఈఈలు కె. రవికుమార్, ఎస్. శ్రీనివాసరావు, ఏఈఈలు కె. కోటేశ్వరరావు, ఎం. సతీష్‌కుమార్, యు. శివశంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగించిన డ్రైన్లలో పూడిక తీయాలి : కమిషనర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో డ్రైన్లపై ఆక్రమణలను, ర్యాంప్ లను తొలగించిన ప్రాంతాల్లో సమగ్రంగా పూడిక తీత చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ బృందావన్ గార్డెన్స్, రాజేంద్ర నగర్, చాకలి గుంట, శశాంక్ గోయల్ కాలనీ, బాలాజీ నగర్ టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్లలోకి వర్షం నీరు వెళ్లడానికి వీలులేకుండా నిర్మాణం చేసిన ఆక్రమణలను, ర్యాంపులను దశలవారీగా తొలగిస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులు పూడికతీత పనులు చేపట్టి, అవసరమైతే నూతన డ్రైన్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తొలగించిన పూడిక వ్యర్థాలను వెంటనే తరలించాలన్నారు. శశాంక్ గోయల్ కాలనీలో జిఎంసి నుండి తీసుకున్న నిర్దేశిత ప్లాన్ కి భిన్నంగా నిర్మాణం చేస్తున్న భవనాన్ని పరిశీలించి తక్షణం తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. బాలాజీ నగర్ టీచర్స్ కాలనీలో అభివృద్ధి పనులు, పారిశుధ్యం పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో రోడ్ ఆక్రమణలు తొలగించక పోవడంపై పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించి, ప్రతి సచివాలయం పరిధిలో ముఖ్యంగా డ్రైన్, ప్రధాన రోడ్ల ఆక్రమణల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఏసిపి రెహ్మాన్, డిఈఈ కళ్యాణరావు, ఎస్.ఎస్. ఆయూబ్ ఖాన్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాయితీపై డ్రోన్‌ల పంపిణీ



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్):** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కాకుమాను గ్రామంలో రైతు గ్రూప్ లకు రాయితీ పై డ్రోన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ డ్రోన్ పూర్తి ధర 9 లక్షల 84 వేల రూపాయలు గా ఉందని అందులో రైతులు వాటా 2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగిలిన 7 లక్షల 84 వేల రూపాయల నగదు రాయితీ వర్తిస్తుందని తెలిపారు. రైతు గ్రూప్ లకు రాయితీ డ్రోన్ లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ శాఖ సిబ్బంది అనిల్ కుమార్, ప్రసాద్, యూనియన్ బ్యాంక్ తెలగాయపాలెం బ్రాంచ్ మేనేజర్ రఫీ, నాయకులు పూర్ణ చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

# పీ4పై చైతన్యం తీసుకురావాలి : ఎమ్మెల్యే నసీర్

- దేశానికే పీ4 కార్యక్రమం ఆదర్శం
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించండి
- శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి
- పీ4, శానిటేషన్ అధికారులతో సమావేశమైన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** పీ4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, ఇది సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో శుక్రవారం పీ4 అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సమాజంలోని ధనికులు, పేద కుటుంబాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఇది గొప్ప కార్యక్రమమని తెలిపారు. పీ4 ద్వారా 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిగా పేదరిక రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు. దీనికనుగుణంగా అధికారులు ఈ పథకం గురించి క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎంత మంది బంగారు కుటుంబాలను గుర్తించారు ? ఎంత మంది మార్గదర్శకులకు నమోదు చేశారో అడిగి తెలుసుకున్నారు. మార్గదర్శకులకు బంగారు కుటుంబాలకు మ్యాప్ చేయాలని సూచించారు. పీ4 కుటుంబాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు.

**శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ అవసరం**

స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందితో ఎమ్మెల్యే నసీర్ సమావేశమయ్యారు. గుంటూరు నగరంలో శానిటేషన్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మైక్రో ప్యాకెట్ల వారీగా శానిటేషన్ పై పర్యవేక్షణ ఉండాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి ప్రాంతంలో తడి, చెత్త పొడి చెత్త కలెక్షన్ పక్కాగా ఉండాలని సూచించారు. మురుగు, చెత్త నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని, తద్వారా వ్యాధులు ప్రబలుతాయని స్పష్టం చేశారు. శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని తెలిపారు.

# సూపర్ జీఎస్టీ వల్ల అన్ని రంగాలకు ప్రయోజనం

- ఏ.సి.కాలేజీలో జీఎస్టీ ఎగ్జిబిషన్
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు ఏ.సి. కాలేజ్ గ్రౌండ్‌లో అసెంబ్లీ హాలులో నిర్వహించిన జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను గుంటూరు పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యురాలు గళ్ళ మాధవి, గుంటూరు తూర్పు నియోజక వర్గ శాసన సభ్యులు నసీర్ అహ్మద్, నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, నగర పాలక కమిషనర్ పులి. శినివాసులు, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతా మాధురితో కలసి ఘనంగా ప్రారంభించారు.

అనంతరం ప్రజా ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ విధానంతో వ్యాపార, వ్యవసాయ రంగాలకు కొత్త ఊపిరి లభించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్ను భారం తగ్గించే దిశగా తీసుకున్న సూపర్ జీఎస్టీ అన్నీ వర్గాలకు ఉపయోగకరంగా వుందన్నారు. వ్యవసాయ రంగంలో ఉపయోగించే యంత్ర పరికరాలపై జీఎస్టీ గణనీయంగా తగ్గడం రైతులకు పెద్ద ఊరటని అన్నారు. మధ్యతరగతి ప్రజలకు ఈ జీఎస్టీ సంస్కరణలు ఒక వరంగా నిలుస్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రజల జీవితంలో అవసరమైన అన్ని రంగాలలోనూ జీఎస్టీ రేట్లు గణనీయంగా తగ్గడంతో వినియోగదారులు దాని ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. తక్కువ పన్నులతో అందుబాటులోకి వస్తున్న ఉత్పత్తులను పరిశీలించి, దేశ ఆర్థిక ప్రగతికి భాగస్వాములుగా మారాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చిన్న మధ్య తరగతి వ్యాపార సంస్థలకు కూడా తక్కువ పన్ను రేట్లతో తమ వ్యాపారాలను మరింత విస్తరించుకొనే అవకాశం కలదన్నారు. అలాగే అత్యవసర మందుల ఉత్పత్తులపై, గృహ వినియోగ వస్తువులపై విద్యుత్ పరికరాలు, అవసరమైన దిన చర్యలో వినియోగించే వస్తువులపై పన్ను తగ్గించటం ద్వారా సాధారణ ప్రజలు జీవ విధానంపై ప్రభావం తగ్గుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్నసూపర్ జీఎస్టీ సదుపాయాలను ప్రతి కుటుంబం తెలుసుకొని ఉపయోగించుకోవాలి అని అన్నారు. ఈ ఎగ్జిబిషన్ లో గుంటూరుకు చెందిన పలు హోమ్ అప్లయెన్సెస్ కంపెనీలు, ఎలక్ట్రానిక్స్, ప్రతినిధులు ఆటోమొబైల్ రంగాలు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. పౌరులు, విద్యార్థులు, వ్యాపార వేత్తలు భారీ సంఖ్యలో హాజరై ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు జీఎస్టీ 2.0లో ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు, తక్కువ పన్నుల విధానాలు, వినియోగదారుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.

# 200 టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు స్వాధీనం కోసం సిద్ధం

- నరసరావుపేటలో ఫలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ కృషి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్):** నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 200 టిడ్కో ఇళ్లు అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తి చేసుకొని, లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. అక్టోబరు 23 నాటికి 200కు పైగా ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా నిలిచారు.

శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో కలిసి టిడ్కో హౌసింగ్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా, కాలనీలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి, నివాసం ఉంటున్న లబ్ధిదారులతో సమస్యల గురించి చర్చించారు. వీధి దీపాల మరమ్మతులు, రహదారులు, మురుగు కాలవలు, కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు వంటి సమస్యలను స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్, పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో రాష్ట్రంలో టిడ్కో కాలనీలను సకల సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ లక్ష్య సాధనలో అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరలోనే ఇళ్ల స్వాధీనం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల్లో పెండింగ్‌లో ఉన్న 270 ఇళ్ల విషయంలో త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, రుణాలు మంజూరు కాని 300 మందికి పైగా లబ్ధిదారుల కోసం బ్యాంకులతో క్యాంపులు ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయించి ఇళ్లు అప్పగిస్తామని తెలిపారు. సేల్ డీడ్ రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అక్టోబరు 23 నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. టిడ్కో కాలనీలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని, లబ్ధిదారులకు అన్ని వసతులు అందుతున్న తీరు ఆనందం కలిగిస్తోందని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, తహసీల్దార్ వేణుగోపాల్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బరాయ గుప్తా తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ చదలవాడ అరవింద బాబు నాయకత్వంలో నరసరావుపేట టిడ్కో కాలనీ అభివృద్ధి మరింత వేగవంతం కానుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అట్టహాసంగా ఖుద్దూస్ జన్మదినవేడుకలు



- ఆశీస్సులందించిన ఎమ్మెల్సీ ఆలపాటి, వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశంపార్టీ కోసం శ్రమిస్తూ అందరి మన్ననలు పొందుతు, పార్టీ పురోభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న యుక్తిపరుడు మహమ్మద్ కుదూస్, నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కుద్దూస్ జన్మదిన వేడుకలో ఆశీస్సులు అందజేశారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మైనార్టీ విభాగం సీనియర్ నాయకులు మహమ్మద్ కుద్దూస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్క ఆనంద్ బాబు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ల, సమక్షంలో కుదుస్ జన్మదిన కేకును కట్ చేసి, వారితో తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం పార్టీ కోసం పని చేసే యుక్తిపరుడు కుద్దూస్, రాజకీయరంగంలో, పార్టీ ప్రతిష్టను పెంచే విధంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు. పార్టీలోని వివిధ స్థాయి నాయకులు, కుద్దూసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పూలదండలతో దుస్సాలులతో సత్కరించి తమ, అభిమానాన్ని, ఆనందాన్నిచాటుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత పట్టణ అధ్యక్షులు కొల్లూరు శ్రీధర్, పద్మశాలియ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, కౌన్సిలర్ బోయపాటి అరుణ, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంతం అశోక్ వర్ధన్, పార్టీలోని పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వస్థ మనసు - సంతోషమైన జీవితం




- మానసిక ఆరోగ్య కౌన్సిలర్ ఎన్.ప్యారి జాన్

**బాపట్ల జిల్లా, (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం అయిన బాపట్ల మున్సిపల్ హై స్కూల్ నందు అవగాహన కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కెరీర్ మరియు మానసిక హెల్త్ కౌన్సిలర్ ఎన్. ప్యారి జాన్, జిసిడీఓ ఎం. చారులత లు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ప్యారి జాన్ మాట్లాడుతూ విద్యార్దులకు మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. స్వస్థ మనసు – సంతోషమైన జీవితం అనే అంశం గురించి వివరించి మానసిక ఆరోగ్యాన్ని కాపుడుకునే అవసరమైన ఆచరణీయ సూచనలు తెలియజేశారు.

**మానసిక ఆరోగ్యం ప్రతి మనిషికి మానవ హక్కు**

ప్రతి ఏటా అక్టోబర్ 10 వ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటూన్నట్లు ప్యారి జాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనసు కూడా శరీరం లాగే ఆరోగ్యంగా ఉండాలన్నారు. బాధ, భయం, కోపం వచ్చినప్పుడు వాటిని మనసులో ఉంచుకోకుండా ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు, స్నేహితులు లతో ఎవరితోనైనా పంచుకోవాలి. ఆటలు ఆడడం, సమయం ప్రకారం నిద్ర పోవడం , ఆరోగ్య కరమైన ఆహారం తీసుకోవడం మనసుకు కూడా మంచిదని తెలిపారు. ఇతరులను గౌరవించడం, సహాయం చేయడం మనసును ఆనందంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో ఎన్. ప్యారి జాన్, చారులత, హెచ్ ఎం రాజేశ్వరి, సత్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక మైలురాయిని అధిగమించిన సీఎం చంద్రబాబు - మండల ఉపాధ్యక్షుడు శీలం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నవ్యాంధ్ర ప్రదేశ్ సీఎంగా నారా చంద్రబాబు నాయుడు చారిత్రక మైలురాయిని అధిగమించారని బ్రహ్మంగారిమఠం టిడిపి మండల ఉపాధ్యక్షుడు నరసింహ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సాధారణ కుటుంబంలో పుట్టి. రాజకీయంగా సొంతకాళ్లపై ఎదిగి ముఖ్యమంత్రిగా 15 సం.రాలు (అక్టోబర్ 10కి) పూర్తి చేసుకున్న వ్యక్తిగా నిలిచారన్నారు. దక్షిణాదిలో ఈ ఘనత సాధించిన రాజకీయ నాయకుల్లో మూడో వ్యక్తిగా ఉన్నారన్నారు. తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి పుదుచ్చేరి సీఎం ఎన్. రంగస్వామి రికార్డును అందుకున్నారన్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు అత్యధిక కాలం సీఎంగా పనిచేసిన ఘనత కూడా ఆయనకే దక్కిందన్నారు.

1995 సెప్టెంబర్ 1న తొలిసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి 8 సంవత్సరాల 255 రోజులు సీఎంగా సేవలు అందించారన్నారు. అలాగే నవ్యాంధ్రప్రదేశ్ సీఎంగా 6 సంవత్సరాల 110 రోజులు పూర్తిచేసుకుని.. మొత్తం 15 సంవత్సరాలపాటు సీఎంగా పనిచేసిన ఘనతను సాధించారన్నారు.

# అంధుల జీవితాలలో వెలుగులు నింపిన పబ్బరాజు

- మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** కీర్తిశేషులు పబ్బరాజు వేంకటేశ్వర రావు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి 1993లో ఉద్యోగ విరమణ చేసిన అనంతరం అంధుల జీవితాల్లో మార్పులు తేవడానికి శ్రీ షిర్డీ సాయి దీన జన సేవా సమితిని స్థాపించి వందలాది అంధ విద్యార్థులకు విద్యను అందించిన మహనీయులు కీ.శే. పబ్బరాజు వేంకటేశ్వరరావు అని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు కొనియాడారు. శుక్రవారం గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో పబ్బరాజు వేంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మానవ సేవా జాతీయ పురస్కారాలను అందించిన సందర్భంగా జరిగిన సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. కె.యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ పబ్బరాజు వేంకటేశ్వరరావు శ్రీమతి రాజ్యలక్ష్మి సహకారంతో వందలాది అంధులను పట్టభద్రులుగా తీర్చిదిద్దినారని వారిలో అనేకమంది ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా, బ్యాంక్ ఆఫీసర్లుగా ఉద్యోగాలు పొందినారని వివరించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ కీ.శే. పబ్బరాజు వేంకటేశ్వరరావు మరణానంతరం పబ్బరాజు వేంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి అంధులు, వికలాంగులు, అనాథల సేవలో నిమగ్నమైన వ్యక్తులకు ఒక పురస్కారం, మరొక పురస్కారం ఉన్నత విద్యను అభ్యసించి అత్యుత్తమ స్థాయికి చేరుకున్న దివ్యాంగులకు అందించడం అభినందనీయమన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా, ప్రపంచ అంధుల సంఘానికి అధ్యక్షులుగా కృషి చేస్తున్న సంతోష్ కుమార్ రుంగ్టా కు మానవ సేవ జాతీయ పురస్కారం అందించడం హర్షనీయమన్నారు. వీరి కృషితోనే 2016లో పార్లమెంట్ దివ్యాంగుల చట్టాన్ని ఆమోదించి అమల్లోకి తెచ్చిందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయిలో మొదటి పి. హెచ్.డి పొంది తొలి దివ్యాంగునిగా ప్రసిద్ధిగాంచిన ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ కి కూడా మానవ సేవా జాతీయ పురస్కారాన్ని అందజేయడం సంతోషకరమన్నారు. వీరిరువురికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. శ్రీ షిర్డీ సాయి దీన జన సేవా సమితి అధ్యక్షులు ఏ. పూర్ణచంద్ర రావు ప్రసంగిస్తూ చల్లా భాస్కరరత్నం వికలాంగ పురస్కారంను విద్యారంగంలో సేవలందిస్తున్న కె. అనూష కి అందించడం సంతోషంగా ఉందన్నారు. వివిధ ప్రాంతాల నుండి దాదాపు 300 మంది అంధ విద్యార్థులు, అంధ ఉద్యోగులు ఈ పురస్కార ప్రధానోత్సవానికి హాజరైనారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు యు. మధుసూదన్ రావు, వి. పాండు రంగారావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొ.ఎం ఎన్. రంగయ్య, వివిఎస్ మూర్తి తదితరులు ప్రసంగించారు.


INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక

జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఏపీ ఎస్ఆర్ఎంకు 'క్యూ ఎస్-ఐ గేజ్ డైమండ్ రేటింగ్'



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీఎస్ఆర్ఎం యూనివర్శిటీకి దేశీయంగా ప్రతిష్టాత్మకమైన గుర్తింపు లభించింది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న 'క్యూ ఎస్–ఐ.గేజ్ సంస్థ' యూనివర్సిటీ పనితీరును , అత్యున్నతమైన విద్యా బోధన, పరిశోధన, విద్యా ప్రమాణాలను విశ్లేషించి డైమండ్ రేటింగ్ ను ప్రకటించింది. అత్యాధునిక సదుపాయాల కల్పన విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ప్లాటినమ్ రేటింగు ప్రకటించిన క్యూఎస్ ఐ గేజ్ సంస్థ ఉద్యోగాల కల్పన, టీచింగ్, లెర్నింగ్, రీసెర్చ్, డైవర్సిటీ వంటి కీలక అంశాలను విశ్లేషించి గోల్డ్ రేటింగ్ ను అందజేసింది. గవర్నెన్స్, మౌలిక సదుపాయాల కల్పన వంటి విషయాల్లో సిల్వర్ రేటింగ్ ను ప్రకటించింది. ప్రతిభ గల ఫ్యాకల్టీల ఏర్పాటు, విద్యా ప్రమాణాలు, పరిశోధనల్లో నూతన పంథా, అంతర్జాతీయ స్థాయి ఎంవోయూలను కూలంకుషంగా విశ్లేషించిన సంస్థ ఓవరాల్ గా ఏపీ ఎసీఆర్ ఎం యూనివర్సిటీకి డైమండ్ రేటింగ్ ను ప్రకటించింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే క్యూ ఎస్–ఐ గిజ్ నుంచి డైమండ్ రేటింగ్ లభించడం ఎంతో సంతోషంగా ఉందని వర్సిటీ ఇన్ ఛార్జి వైస్ ఛాన్సిలర్ ఆచార్య సతీష్ కుమార్ పేర్కొన్నారు. యూనివర్సిటిలో భోధన, పరిశోధన వంటి కీలక అంశాల్లో మరింత పురోగతిని సాధిస్తామని క్వాలిటీ అన్యూరెన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ పేర్కొన్నారు.

## ఇప్పటం గ్రామంలో స్వచ్ఛత అవగాహన




**ఇప్పటం ( జర్నలిస్ట్ ఫైల్ ):** నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ మరియు ఉన్నత భారత అభియాన్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పటం గ్రామంలో స్వచ్ఛత మరియు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు గ్రామ ప్రజలకు పరిశుభ్రత అవసరం, చెత్త వేర్పాటు, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల విద్యార్థులు ముందుగా గ్రామ సచివాలయానికి చేరుకుని, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు సలహాల మేరకు పరిసరాల పరిశుభ్రత, తడి–పొడి చెత్త వేర్పాటు, ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి అంశాలను ప్రజలకు వివరించారు. తరువాత విద్యార్థులు ఇంటింటికి వెళ్లి పరిశుభ్రత సర్వే నిర్వహిస్తూ, గ్రామవాసులలో చైతన్యం సృష్టించారు. తరువాత విద్యార్థులు ప్రాథమిక పాఠశాలకు చేరుకుని మానవహారంగా ఏర్పడి, స్వచ్ఛత ముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతతో కూడిన నినాదాలు, స్లోగన్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమం చివరలో విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన "స్వచ్ఛత ప్రతిజ్ఞ"ని స్వయంగా చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ రేవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి మరియు ప్రిన్సిపల్ డాక్టర్ బి. పాముల రెడ్డి అభినందించారు. కార్యక్రమానికి ఇదేవిధంగా ఇప్పటం గ్రామ సచివాలయం కార్యదర్శి నందం బాల పరమేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల సీనియర్ టీచర్ నల్లపాటి మధుబాబు, జాతీయ సేవా పథకం స్టూడెంట్ కోఆర్డినేటర్స్ ఎం. బిందు ప్రియాంక, ఎస్.కే. రజియా బేగం, జి. ప్రజ్ఞ, ఎం. మధుమిత, పి. సాయి స్నిగ్ధ, ఎం.డి. హలీమా నౌరి, ఎం. హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటం గ్రామ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెరిగింది, విద్యార్థుల చైతన్యం ప్రతిఫలించింది.

## నూతన టీచర్ల కొరకు పిఆర్టియు డైరీ ఆవిష్కరణ



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** మెగా డీఎస్సీ 2025 ద్వారా కూటమి ప్రభుత్వం నిష్పక్షపాతంగా,ఎటువంటి అవకతవకలకు చోటు లేకుండా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టటం పట్ల పిఆర్టియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్ జానీ, సోల రాఘవ రాజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం విజయవాడ ప్రతిభ కోచింగ్ సెంటర్ అధినేత జంపాన సుధాకర్ సౌజన్యంతో నూతన ఉపాధ్యాయ వృత్తి చేపట్టే అభ్యర్థుల కోసం 64 పేజీల లీవ్ రూల్స్, ముఖ్య జీవోలు మరియు ముఖ్య సమాచార సంపుటి (హ్యాండ్ బుక్) ను ఎన్టీఆర్ జిల్లా పిఆర్టియు ముఖ్య నాయకులతో కలసి ఆవిష్కరించారు.

డీఎస్సీ 2025 నోటిఫికేషన్ ఇచ్చి ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేని విధంగా రికార్డ్ స్థాయిలో 150 రోజులలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు ఈ సందర్భంగా పిఆర్టియు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో పాఠశాలలలో భౌతిక వనరులకల్పన మరియు విద్యార్థుల సర్వ విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.ప్రతిభ కోచింగ్ సెంటర్ అధినేత జంపాల సుధాకర్ మాట్లాడుతూ ఈ డీఎస్సీ 2025 నందు మా ప్రతిభ కోచింగ్ సెంటర్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఎస్జిటి స్టేట్ సెకండ్ ర్యాంక్ ,పి.జి.టి సైన్స్ నందు స్టేట్ ఫస్ట్ ర్యాంక్, పిజిటి గణితం నందు స్టేట్ సెకండ్ ర్యాంకు తోపాటు ఎంతోమంది విద్యార్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారని ఎంతోమంది విద్యార్థులు ఉపాధ్యాయ పరీక్షలు నందు ఉత్తీర్ణత పొందారని తెలిపారు.

తదనంతరం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామక పత్రాలు తీసుకొని పామర్రు లో ఇండక్షన్ ట్రైనింగ్ తీసుకుంటున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు 900 బుక్ లెట్ లు మరియు తిరువూరు వాహిని ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ పొందుతున్న 250 మంది నూతన ఉపాధ్యాయులకు బుక్లెట్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఆర్టియు ముఖ్య నాయకులు కృష్ణాజిల్లా అధ్యక్షులు పెద్దిబోయిన శ్రీనివాసరావు,ప్రధాన కార్యదర్శి మనోహర్, ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆవుల రాంబాబు,మర్రి ప్రభాకర్,రాష్ట్ర కార్యదర్శి బాబ్జి,జాన్ సునంద్, సతీష్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆడ, మగ సమానత్వ భావన ఇంటి నుంచే నేర్పాలి

- తల్లిదండ్రుల మాటలు, వ్యవహారాలతో మొదలవ్వాలి
- బాలికలు, మహిళల రక్షణకు "మహిళా కమిషన్" విస్తృత కార్యక్రమాలు
- త్వరలోనే ఆన్ లైన్ ఫిర్యాదుల పోర్టల్ ఏర్పాటు
- విజయవాడలో 'స్పాట్ లైట్ సెషన్' లో ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ వెల్లడి




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఆడామగ సమానత్వం ఇంటి నుంచే నేర్పడం చాలా ముఖ్యం. పిల్లల లింగ సంబంధ అవగాహన, సమాన భావనలు మొదలవ్వాలంటే, తల్లిదండ్రుల మాటలు, వ్యవహారాలతోనే మొదలవ్వాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. అబ్బాయిలు అమ్మాయిలు ఒకటేనని, ఇద్దరికీ గౌరవం, ధైర్యం, చదువు సమానంగా ఉండాలన్నారు. లింగ వివక్షకు దూరంగా మాటలు, ప్రవర్తనలు ఉండటం అవసరమన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం (అక్టోబర్ 11న) పురస్కరించుకుని శుక్రవారం విజయవాడ కేబీఎన్ కళాశాలలో 'మహిళా కమిషన్', 'యూజీసీ మహిళా స్టడీ సర్కిల్ కేబీన్ కాలేజీ' సంయుక్త అధ్వర్యంలో 'స్పాట్ లైట్ సెషన్స్' కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ హాజరయ్యారు. తొలుత కళాశాల విద్యార్థినులతో కలిసి స్వేచ్ఛ బెలూన్లను ఎగురవేశారు. అనంతరం జరిగిన స్పాట్ లైట్ సెషన్ లో రాయపాటి శైలజ మాట్లాడారు. కమిషన్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన 4 నెలల కాలంలో తాను పరిశీలించిన కేసులను ఆమె ప్రస్తావించారు. లింగ సమానత్వం ఇంటి నుంచే అవగాహన ఉంటే పిల్లల మైండ్ సెట్ లో సమానత్వం బలంగా మారుతుందన్నారు. పాఠశాలలు కూడా ఇలాంటి సమానత్వ బోధనను ప్రోత్సహించాలన్నారు. టీచర్లు తరగతుల్లో జెండర్ పాత్రల విషయంలో అబ్బాయిలు–అమ్మాయిల మధ్య భేదాభిప్రాయాలు తగ్గించేలా శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. అలాంటప్పుడే సామాజిక సమానత్వానికి, మహిళ సాధికారతకు పునాది వేస్తుందన్నారు. ఇలాంటి మార్పులు చదువు దగ్గర, కుటుంబం వద్ద రెండు చోట్ల మొదలవ్వాలవ్వాలని కోరారు. మహిళలు, బాలికలకు అండగా ఉంటూ సమస్యలు ఎదుర్కొంటున్న బాధితులకు సోషల్? సెక్యూరిటీ పెంచడానికి మహిళా కమిషన్ ముందంజలో ఉంటుందన్నారు. ఇప్పటికే మహిళా కమిషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు, ఒన్ స్టాప్ సెంటర్ల ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నారని చెప్పారు. నిరంతరం మహిళల రక్షణ కోసం లీగల్?, సైకాలజిస్ట్?, మెడికల్? సౌకర్యాలతో మహిళా కమిషన్ అందుబాటులో ఉందన్నారు. క్రైం రేటులో ఎక్కువగా మహిళలు, బాలికలపై అత్యాచారాలు, వేధింపుల కేసులే నమోదవడంపై దృష్టి సారించి, వాటిని తగ్గించడానికి కృషి చేస్తామన్నారు. మైనర్ల మీద జరుగుతున్న అత్యాచారాలకు సంబంధించిన ఫోక్సో చట్టంపై అవగాహన పెంచేలా మరిన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్, ఒన్ స్టాప్ సెంటర్లు మరిన్ని ఏర్పాటు చేసి సమస్యలను సున్నితంగా పరిష్కరించాలని కమిషన్ నిర్ణయించిందన్నారు. సమస్యలు ఎదురైనా మహిళలు, బాలికలు ఎవరికి చెప్పుకోలేక మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారి కోసం మహిళా కమిషన్ తోడుగా ఉంటుందని ... త్వరలోనే ఆన్ లైన్ వెబ్ పోర్టల్ ను ప్రారంభించనున్నట్లు ఆమె వివరించారు. సమస్యను బహిర్గతం చేయకుండా బాధితుల ఉనికి బయటకు తెలియకుండా పరిష్కరించడం కమిషన్ ఉద్దేశమన్నారు. బాధితులకు డైరెక్ట్? కౌన్సిలింగ్?తో పాటు ఆన్?లైన్ కౌన్సిలింగ్? కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

**రహస్య విచారణల ద్వారా..:** లైంగిక దాడులకు గురైన మహిళలు, బాలికలకు భరోసా, రక్షణ కోసం మహిళా కమిషన్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న సంగతిని వివరించారు. జరిగిన సంఘటన బాధితుల మైండ్?లో లేకుండా డైరెక్ట్?గా, లేదా ఆన్?లైన్?లో కౌన్సిలింగ్? ఇస్తామన్నారు.

**ఉమన్ రిలేటెడ్ కేసులే:** ప్రస్తుతం ఏ కేసు చూసిన ఉమన్? రిలేటెడ్ కేసులే నమోదవుతున్నాయని.. మహిళలు, బాలికలకు చట్టాలపై అవగాహన లేకపోవడతో చాలా మంది మహిళలు ఎదుటి వారి మాటలకు మోసపోయి, హత్యలకు గురుతున్నారన్నారు. హత్యకేసుల్లో నింధితులుగా ఉంటున్నారని, ఆకర్షణకు లోనవుతున్న మైనర్? బాలికలు, వారికి తెలియకుండానే సమస్యల్లో ఇరుక్కుంటున్నారని,కానీ సమస్యను సంబంధిత శాఖ అధికారులకు చెప్పడానికి వెనుకాడుతున్నారని... విమెన్? రిలేటెడ్? కేసులు తగ్గించడం, మైనర్? బాలికలకు అండగా ఉండటానికి కమిషన్ ముందుంటుందన్నారు. బాలిక సంరక్షణ కోసం ఏర్పడ్డ ఫోక్సో యాక్ట్? గురించి, రానున్న రోజుల్లో కాలేజీలు, స్కూళ్లల్లో బాలికలకు అవగాహన కల్పించనున్నామన్నారు. పనిచేసే ప్రాంతాలలో అంతర్గత ఫిర్యాదులు కమిటీ (ఐసీసీ ప్రత్యేక సెల్?) ఏర్పాటు చేయడంతో పాటు కంప్లయింట్? చేసే ధైర్యాన్ని మహిళలు, బాలికల్లో కలిగేలా క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు.

**మహిళల్లో మనోధైర్యాన్ని పెంచుతాం..:** వెబ్ పోర్టల్ ద్వారా ఆన్ లైన్ కౌన్సిలింగ్, టోల్ ఫ్రీ నెంబర్ల ఏర్పాటు ద్వారా మహిళల్లో మనోధైర్యాన్ని పెంచుతామని రాయపాటి శైలజ వివరించారు. బాలికల మానసిక వత్తిడి అనేది వారి శారీరక, మానసిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఇది పెద్దగా ఉన్నప్పుడు వారి ఆరోగ్య సమస్యలు, పీరియడ్ అసమతుల్యత, ఆందోళనలు, డిప్రెషన్ వంటి పరిస్థితులకు దారితీయవచ్చు అని వివరించారు. చట్టాలపై అవగాహన సదస్సులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడంతో పాటు విద్యలో ఒక భాగం చేయాలన్న ఆలోచన చేస్తున్నామని.. ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తో చర్చించినట్లు కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ చెప్పారు.

**విజయవంతంగా స్పాట్ లైట్ సెషన్:** మార్పు ట్రస్ట్ అధినేత ఆర్. సూయజ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తో ముఖాముఖి నిర్వహించారు. మహిళలపై నేడు జరుగుతున్న అఘాయిత్యాలు, సోషల్ మీడియా వేదికగా వేధింపులు ఇలా పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు రాయపాటి శైలజ విపులంగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంతోపాటు వారిలోని జిజ్ఞాసను ఆమె ప్రశంసించారు. అనంతరం కేబీఎన్ కళాశాల ఉపాధ్యాయ, అధ్యాపక బృందం రాయపాటి శైలజ ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కేబీఎన్ కళాశాల నిర్వహించే ఉచిత కుట్టు శిబిరాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఓ రమణరావు,

## ఆర్టీసి ఉద్యోగుల పదోన్నతులపై జీఓ విడుదల చేయాలి



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జిఓను దీపావళి పండగలోగా విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టాల్సి వస్తుందని ఏపిపిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య హెచ్చరించారు. ఆర్టీసీ విలీనానంతరం గత ఆరు సంవత్సరాలుగా అసిస్టెంట్ మెకానిక్ నుండి అసిస్టెంట్ మేనేజర్ వరకు, డిపో మేనేజర్ నుండి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పాత పద్ధతుల్లో ఉన్న శిక్షలు, సడలింపులు, అనుమతుల సమస్యల కారణంగా పదోన్నతులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఎన్నో సార్లు ఈ సమస్యపై ఏపిపిటిడి యూనియన్ నిరంతరం కృషి చేయడంతో ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వం అనుమతుల కోసం లేఖ రాసిందని, ఆగస్టు 28న ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ జిఏడి శాఖలో ఫైలు పెండింగ్ లో ఉండటం వల్ల ఇప్పటికీ జిఓ విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల సుమారు 6000 మంది ఆర్టీసీ ఉద్యోగులు నిరాశలో ఉన్నారని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఆరు జిల్లాల విజయనగరం జోన్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ స్థాయి కౌన్సిల్ సమావేశం జోనల్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంతవరకు జోనల్ అధ్యక్షులుగా పనిచేసిన కె.జె.శుభాకర్ గత నెల 30న ఉద్యోగ విరమణ చేయడంతో జోన్ కు చెందిన 19 డిపోల ఉద్యోగులు, నాయకులు కలిసి ఆయనకు ఘన సత్కారం అందించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆగస్టు 15 నుండి అమలు చేసిన స్త్రీ–శక్తి పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ ఉద్యోగుల శ్రమ అపారమని అన్నారు. అసెంబ్లీలో కూడా ముఖ్యమంత్రి సిబ్బందిని అభినందించడం గర్వకారణమని పేర్కొన్నారు. అయితే బస్సులు తక్కువగా ఉండటం, ప్రయాణికులు అధికంగా ఉండటం, సిబ్బంది కొరతతో తీవ్రమైన పనివత్తిడిలో ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఇంత శ్రమిస్తున్న సిబ్బందిపై దాడులు జరగడం అన్యాయమని, ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకొని దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయుడి పై దాడి అమానుషం - ఆప్టా

**కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్):** గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు జి.సి. బసవరాజు పై శుక్రవారం దాడి జరిగింది. అదే గ్రామానికి చెందిన మీసాల రంగస్వామి శారీరకంగా కొట్టి ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు కలిగించారు.

సమాచారం ప్రకారం, ఉపాధ్యాయుడు విద్యార్థిని పాఠశాలకి సమయానికి హాజరు కావాలని మద్దతు ఇచ్చిన సందర్భంలో విద్యార్థి తండ్రి ఆగ్రహంతో దాడికి పాల్పడ్డాడు. దాడిలో ఉపాధ్యాయుడు తీవ్ర గాయాలపాలయ్యారు.

ఏ.పి. ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జి.ఎస్. గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ మరియు పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ఆప్టా నాయకులు ఉపాధ్యాయుల భద్రత, గౌరవం రక్షించబడేలా రాష్ట్రవ్యాప్తంగా చర్యలు తీసుకోవాలని మళ్లీ పిలుపునిచ్చారు.

## భ్రమరాంబ గెస్ట్ హౌస్‌ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్



**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** భారత ప్రధానమంత్రి ఈనెల 16న శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పర్యటనకు రానున్న నేపథ్యంలో, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ఆదివారం భ్రమరాంభ గెస్ట్ హౌస్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లు, వసతులను సమీక్షించారు. పర్యటన సందర్భంగా ఆయన గెస్ట్ హౌస్‌లో ఉన్న వసతి సదుపాయాలు, గదుల శుభ్రత, ఆహార వసతులు, మరియు నిర్వాహణ విధానాలను పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గెస్ట్ హౌస్ ప్రాంగణంలోని పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది డ్యూటీలు వంటి అంశాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ మాట్లాడుతూ, "ప్రధానమంత్రి శ్రీశైలం పర్యటన సందర్భంగా గెస్ట్ హౌస్‌లో వసతులను మెరుగుపరచడం అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తున్నామన్నారు. సౌకర్యవంతమైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, మరియు సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గెస్ట్ హౌస్‌లో ఉన్న సదుపాయాలను ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా మరమ్మతులు, అభివృద్ధి పనులు వెంటనే పూర్తిచేయాలని సూచించారు. విశిష్ట అతిథులకు సౌకర్యవంతంగా ఉండేలా విద్యుత్, నీటి సరఫరా, భద్రతా పర్యవేక్షణ వ్యవస్థలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, దేవస్థాన అధికారులు జేసీ వెంట ఉన్నారు.

## ఎస్ఆర్ఎంలో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం మూడవ రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్ జరిగింది. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ బలరామ్ పద్మనాభన్ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించి రీసెర్చ్ స్కాలర్లను ఉద్దేశించి ప్రసంగించారు.. పరిశోధనా రంగంలో అడుగు పెట్టిన ప్రతి విద్యార్థి ప్రధానంగా విజ్ఞానాన్నీ, పరిశోధనాంశాలపై పట్టు పెంచుకోవాలన్నారు. రోజురోజుకీ సైన్స్ విస్తృతమవుతున్న ప్రస్తుత రోజుల్లో నూతన ఆవిష్కరణలు భారత్ కీర్తిని మరింత ఇనుమడింపజేస్తున్నాయన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన భారత వాతావరణ పరిశోధనా ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్) డైరెక్టర్ డాక్టర్ అమిత కుమార్ పాత్ర మాట్లాడుతూ, ఆసక్తి లేనిదే ఆవిష్కరణలు అసాధ్యమన్నారు. మన దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతి సాధిస్తుందని, శాస్త్రీయ పరిశోధన దేశ అభివృద్ధికి ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు.

నూతన ఆవిష్కరణలకు యూనివర్సిటీలు కేంద్రాలుగా మారాలని ఎస్ఆర్ఎం గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి నారాయణరావు సూచించారు. చంద్రయాన్ తో భారత్ కీర్తి విశ్వవ్యాప్తంగా మారిందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్ ప్రకటించిందని, ఇందులో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నోడల్ ఏజెన్సీగా గుర్తించబడిందని ఆయన పేర్కొన్నారు. ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ లో క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని నారాయణరావు పేర్కొన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ రీసెర్చ్ సమ్మిట్ ఏర్పాటు చేయడం పరిశోధనా అంశాలపై అవగాహన కలిగించడం ఉపయుక్తంగా మారిందని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బలరామ్, అమిత్ కుమార్ పాత్రో, టి నారాయణ రావులను యూనివర్సిటీ యాజ మాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా వేదికపై రీసెర్చ్ అబ్ స్ట్రాక్ట్ బుక్లెట్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ తప, రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చింది. ఉద్యోగుల ఐక్యవేదిక ప్రతినిధులతో సచివాలయాల శాఖ రాష్ట్ర కార్యదర్శి కాటమనేని భాస్కర్ అధ్యక్షతన ఈరోజు చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో సచివాలయాల శాఖ రాష్ట్ర సంచాలకులు ఎం. శివప్రసాద్, అదనపు కమిషనర్ జి. సూర్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల తరపున ఐక్యవేదిక రాష్ట్ర ఛైర్మన్ ఎం.డి. జాని పాషా, సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్, కో–ఛైర్మన్లు బత్తుల అంకమ్మరావు, వి. భార్గవ్ సుతేజ్, యువ షణ్ముఖ్, డెప్యూటీ సెక్రటరీ జనరల్ యస్. నాగేశ్వరరావు, వైస్ ఛైర్మన్లు యస్.కె. మహబూబ్ బాషా, జి.వి.యస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల శాఖ రాష్ట్రకార్యదర్శి మాట్లాడుతూ నోషనల్ ఇంక్రిమెంట్ల దస్త్రాన్ని మళ్లీ ఆర్థిక శాఖకు పంపించి అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ఇంటింటి సర్వేలను ఆరు నెలలకు ఒకసారి లేదా సంవత్సరంలో రెండు మూడు సార్లు మాత్రమే నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆరు సంవత్సరాలు ఒకే క్యాడర్ లో పనిచేసిన ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్ మంజూరు కోసం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

దివ్యాంగ ఉద్యోగులను క్షేత్రస్థాయి విధుల నుండి విముక్తి కల్పించేందుకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. పండుగలు, ఆదివారాలు, సెలవు రోజుల్లో విధులు అప్పగించరాదని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ సర్వీస్ రిజిస్టర్‌ను ఆన్లైన్ విధానంలో అమలులోకి తెస్తామని, సెలవులు మంజూరుకు ఇబ్బందులు లేకుండా 24 గంటల్లో ఆటోమేటిక్ అప్రూవల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

పదోన్నతుల సమస్యల పరిష్కారం కోసం అన్నీ శాఖల మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ మరియు డిసెంబర్‌లో స్పోర్ట్స్ మీట్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహిస్తామని కూడా హామీ ఇచ్చారు.

సంక్షేమ విద్యాసహాయకులు మరియు వార్డు విద్యా కార్యదర్శులు స్కూల్ టాయిలెట్స్ ఫోటోలు తీసే విధుల నుండి విముక్తి కల్పించాలని ఐక్యవేదిక ప్రతినిధులు కోరగా, సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని కార్యదర్శి అన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శుల పదోన్నతులకు అడ్డుగా ఉన్న జి.ఒ 523ను సవరించాలని కోరగా, మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని విభాగాల సచివాలయ ఉద్యోగుల సమస్యలను కూడా ఈ సమావేశంలో చర్చించారు.

తరువాత సచివాలయాల శాఖ మంత్రికార్యాలయం పిలుపు మేరకు ఐక్యవేదిక ప్రతినిధి బృందం మంత్రిని కలిసింది. మంత్రివర్యులు రాష్ట్ర సచివాలయాల శాఖ కార్యదర్శి నుండి నివేదిక కోరించి, న్యాయమైన అన్నీ సమస్యలను నిర్దిష్ట గడువులో పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467